RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 11 సంచిక : 13 మంగళవారం 19 - 08 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

## మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి తెలంగాణ హైకోర్టు నోటీసులు



**ఓబుళాపురం మైనింగ్ కేసులో నోటీసులు జారీ చేసిన హైకోర్టు**

**నిర్దోషులుగా తేల్చుతూ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేసిన సీబీఐ**

**సబితతో పాటు మాజీ ఐఏఎస్ కృపానందకు నోటీసులు జారీ**

**15 ఏళ్ల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకురాలు సబితా ఇంద్రారెడ్డికి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో సబితా ఇంద్రారెడ్డితో పాటు మాజీ ఐఏఎస్ కృపానందానికి కూడా నోటీసులు జారీ అయ్యాయి. వీరిద్దరిని నిర్దోషులుగా తేల్చుస్తూ నాంపల్లి సీబీఐ కోర్టు గతంలో తీర్పు వెలువరించింది.సీబీఐ ఈ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ క్రమంలో ఉన్నత న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని వీరిద్దరిని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. - మిగతా 2 లో

# గత ప్రభుత్వం చేసిన చట్టమే మనకు అడ్డంకి

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు
- ట్యాంక్‌బండ్ సమీపంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- పాపన్నగౌడ్ చరిత్ర, స్ఫూర్తిని, కోటను చారిత్రక కట్టడాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు వెల్లడి
- బహుజనుల సామ్రాజ్యాన్ని అందరికీ ఎలా అందించవచ్చో పాపన్నగౌడ్ నిరూపించారన్న సీఎం
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారన్న ముఖ్యమంత్రి
- దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా కులగణన సర్వే చేశామన్న సీఎం
- బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ కలిపితే రిజర్వేషన్లు 70 శాతం వరకు చేరుతాయన్నారు ముఖ్యమంత్రి
- తెలంగాణలో 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వకుండా గత ప్రభుత్వం చట్టం చేసిందని రేవంత్ రెడ్డి ఆక్షేపించారు



బహుజనుల సామ్రాజ్యాన్ని అందరికీ ఎలా అందించవచ్చో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ నిరూపించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా జరిగిన పాపన్న గౌడ్ 375వ జయంతి ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్ సమీపంలో సీఎం ఆయన విగ్రహానికి శంకుస్థాపన చేశారు. పాపన్నగౌడ్ విగ్రహం తెలంగాణ సమాజానికి ఆదర్శంగా నిలబడాలని అభిలాషించారు. పాపన్నగౌడ్ కోటను గత ప్రభుత్వాలు మైనింగ్ లీజులకు ఇచ్చాయని, గతంలో ఖిలాషాపూర్ కోటను కాలగర్భంలో కలపాలని కొంతమంది చూశారని ఆక్షేపించారు.పాపన్న గౌడ్ - మిగతా 2 లో

కేంద్రం నుంచి 3 లక్షల మెట్రిక్ టన్నుల

## యూరియా రావాలి




**కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి**

కేంద్రం రాష్టానికి ఇవ్వాల్సిన యూరియా విషయంలో జాప్యాన్ని నిరసిస్తూ పార్లమెంట్ ఆవరణలో ఆందోళన వ్యక్తం

తెలంగాణ రాష్టానికి చెందిన ఎంపీలందరం వాయిదా తీర్మానం ఇచ్చామని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి వెల్లడించారు

తెలంగాణ బీజేపీ ఎంపీలకు సైతం కేంద్రమంత్రి నడ్డాకు ఇచ్చే లేఖను అందజేస్తామని పేర్కొన్నారు

రామగుండంలో ఫెర్టిలైజర్ కంపెనీ ఉంటే ఢిల్లీ నోయిడాలో కూర్చొని అధికారులు విధులు నిర్వహిస్తున్నారని ఈ సందర్భంగా ఎంపీ బలరాం నాయక్ తెలిపారు

## దీపావళికి చౌకగా కార్లు, బైకులు!

- దీపావళికి 'డబుల్ బొనాంజా' ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీ
- భారీగా తగ్గనున్న కార్లు, ద్విచక్ర వాహనాల ధరలు
- 28 శాతం జీఎస్టీ శ్లాబును 18 శాతానికి తగ్గించేందుకు కేంద్రం ప్రతిపాదన
- మధ్యతరగతి, సామాన్యులకు ఊరట కల్పించడమే లక్ష్యమన్న కేంద్రం
- సెప్టెంబర్‌లో భేటీ కానున్న జీఎస్టీ కౌన్సిల్, తుది నిర్ణయానికి అవకాశం
- పెరిగిన ఉత్పాదక వ్యయం, అధిక వడ్డీ రేట్ల కారణంగా కొన్నేళ్లుగా ఎంట్రీ-లెవెల్ కార్లు, బైకుల అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి



ఢిల్లీ: పండగ సీజన్‌కు ముందు సొంత వాహనం కొనాలనుకునే సామాన్యులు, మధ్యతరగతి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించనుంది. కార్లు, ద్విచక్ర వాహనాలపై ప్రస్తుతం ఉన్న వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను గణనీయంగా తగ్గించేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ దీపావళికి సామాన్యులకు 'డబుల్ బొనాంజా' అందిస్తామని, వస్తువుల ధరలు తగ్గేలా జీఎస్టీలో సంస్కరణలు తీసుకొస్తామని స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించడంతో ఈ వార్తకు మరింత ప్రాధాన్యత చేకూరింది.ప్రస్తుతం దేశంలో అమలవుతున్న నాలుగు అంచెల జీఎస్టీ విధానాన్ని రెండు శ్లాబులకు పరిమితం చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. 5 శాతం, 18 శాతం శ్లాబులను మాత్రమే కొనసాగించాలని తన ప్రతిపాదనను జీఎస్టీ కౌన్సిల్‌కు పంపింది. రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన ఈ కౌన్సిల్ సెప్టెంబర్‌లో సమావేశమై ఈ ప్రతిపాదనపై తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ మార్పులు అమలైతే ప్రస్తుతం 28 శాతం పన్ను పరిధిలో ఉన్న అనేక వస్తువులు, ముఖ్యంగా కార్లు, బైకులు - మిగతా 2 లో

## వయసు కంటే ముందే రక్తనాళాలకు వృద్ధాప్యం

- గుండెపోటు ముప్పుపై పరిశోధకుల హెచ్చరిక
- కోవిడ్ సోకిన వారిలో రక్తనాళాలకు అకాల వృద్ధాప్యం
- తేలికపాటి ఇన్ఫెక్షన్‌తోనూ గుండె, పక్షవాతం ముప్పు
- పురుషుల కంటే మహిళల ధమనులపైనే తీవ్ర ప్రభావం
- లాంగ్ కోవిడ్ బాధితుల్లో ఈ సమస్య మరింత ఎక్కువ
- వ్యాక్సిన్ తీసుకున్నవారిలో రక్తనాళాలు మెరుగ్గా ఉన్నట్టు గుర్తింపు




## భారత్‌కు అమెరికా తీవ్ర హెచ్చరిక




భారత్ చర్య ఉక్రెయిన్ యుద్ధానికి నిధులు సమకూర్చినట్టేనని ఆరోపణ

రష్యా, చైనాలతో భారత్ సన్నిహితంగా ఉంటోందన్న వైట్‌హౌస్ సలహాదారు

వ్యూహాత్మక భాగస్వామిగా ఉండాలంటే అందుకు తగ్గట్టు నడుచుకోవాలని సూచన

అమెరికా ఆరోపణలను తిప్పికొట్టిన భారత విదేశాంగ శాఖ

అమెరికా, ఐరోపా దేశాలూ రష్యాతో వ్యాపారం చేస్తున్నాయని కౌంటర్

# ఏపీలో నూతన బార్ పాలసీ కొత్త మార్గదర్శకాలు

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కొత్త బార్ పాలసీ నిర్ణయం తీసుకుందని ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ తెలిపారు
- ఏపీ వ్యాప్తంగా 840 బార్లు
- పదిశాతం కల్లు గీత కులస్థులకు కేటాయిస్తామని పేర్కొన్నారు
- గతంలో బార్ లైసెన్స్ పొందాలంటే రెస్టారెంట్ లైసెన్స్ ముందే ఉండాలని.. ఈసారి ఈ నిబంధన సడలించామని చెప్పుకొచ్చారు
- 50 వేల లోపు జనాభా ఉంటే రూ.35 లక్షల లైసెన్స్ ఫీజు ఉంటుందని వెల్లడించారు ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్
- 50 వేల నుంచి 5 లక్షల జనాభా ఉంటే రూ.55 లక్షలు,5 లక్షలపైన జనాభా ఉంటే లైసెన్స్ ఫీజు రూ. 75 లక్షలు ఉంటుందని చెప్పారు
- ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు బార్లకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు
- సెప్టెంబర్ 1వ తేదీ నుంచి కొత్త పాలసీ అందుబాటులోకి వస్తోందని ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు



అమరావతి, ఆగస్టు18 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కొత్త బార్ పాలసీ నిర్ణయం తీసుకుందని ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ తెలిపారు. 840 బార్లు ఏపీ వ్యాప్తంగా ఉన్నాయని.. పదిశాతం కల్లు గీత కులస్థులకు కేటాయిస్తామని పేర్కొన్నారు. కొత్త వారు ఈ బిజినెస్‌లోకి రావడానికి కొన్ని మార్పులు చేశామని వివరించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కొత్త బార్ పాలసీ నిర్ణయం తీసుకుందని ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ తెలిపారు. 840 బార్లు ఏపీ వ్యాప్తంగా ఉన్నాయని.. పదిశాతం కల్లు గీత కులస్థులకు కేటాయిస్తామని పేర్కొన్నారు. కొత్త వారు - మిగతా 2 లో

కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్‌తో

## మంత్రి నారా లోకేశ్ భేటీ



**ఏపీలో డేటా సిటీ ఏర్పాటుకు సహకారం అందించాలని విజ్ఞప్తి**

**ఇటీవల ఏపీ ప్రభుత్వ బృందం సింగపూర్ పర్యటన వివరాలను మంత్రికి తెలియజేసిన లోకేశ్**

**ఏపీ అభివృద్ధి కోసం సింగపూర్ ప్రభుత్వంతో జరిపిన చర్చల గురించి వివరణ**

**విశాఖపట్నంలో డేటా సిటీని అభివృద్ధి చేయడం వల్ల భవిష్యత్తులో ఏపీ టెక్నాలజీ హబ్ గా తయారవుతుందని చెప్పారు**

**వలస కార్మికులకు ఓవర్సీస్ ట్రైనింగ్, మైగ్రేషన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కోసం ఫాస్ట్ ట్రాక్ అనుమతులతో పాటు నిధులు మంజూరు చేయాలని మంత్రి లోకేశ్ కోరారు**

ఢిల్లీ: ఏపీ నుంచి ఉద్యోగాల కోసం ఇతర దేశాలకు వెళ్లే యువతకు సాఫ్ట్ స్కిల్స్ లో శిక్షణ ఇచ్చేందుకు విశాఖపట్నంలో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, డాటా సిటీ ఏర్పాటుకు కేంద్ర సహకారం అందించాలని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్‌కు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో కేంద్ర విదేశాంగశాఖ మంత్రితో లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ - మిగతా 2 లో

## తీరాన్ని దాటనున్న వాయుగుండం ఏపీకి వర్ష సూచన




బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం ఉదయానికి వాయుగుండంగా మారే అవకాశం

దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర మధ్య తీరం దాటే సూచన

కోస్తాంధ్రలో పలుచోట్ల భారీ వర్షాలకు ఛాన్స్

తీరం వెంబడి గంటకు 60 కి.మీ వేగంతో గాలులు

మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లరాదని హెచ్చరిక

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మంగళవారం 19 - 08 - 2025

# సంపాదకీయం

## మళ్ళీ చిగురించిన దోస్తీ

అమెరికాతో చెడుతున్నకొద్దీ, చైనాతో స్నేహం పెరుగుతోంది. చైనా అధికారప్రతినిధి భారత్‌తో సంబంధాలమీద చేసిన వ్యాఖ్యలు వస్తున్న మార్పును స్పష్టంగా సూచిస్తున్నాయి. భారత్ అభ్యంతరాలను గుర్తించడం, పొరపాట్లను సరిదిద్దుకోవడం, విశ్వాసాన్ని పెంచే చర్యలు చేపట్టడం గురించి ఆయన నిర్దిష్టంగా మాట్లాడారు. ఉభయదేశాల మధ్యా సరిహద్దు వాణిజ్యాన్ని పునరుద్ధరించేందుకు ఐదేళ్ళ తరువాత ప్రయత్నాలు జరుగుతున్నాయంటేనే, కొత్త ప్రేమలు చిగురిస్తున్నాయని అర్థం. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం పర్వతశ్రేణుల్లో జరగబోతున్న ఈ ప్రయత్నం పరిమాణం రీత్యా పెద్దది కాకున్నా, ఒక సానుకూల పరిణామం. త్వరలోనే చైనా విదేశాంగమంత్రి మనదేశంలో పర్యటించడం కూడా గల్వాన్ ఘాతుకం అనంతరం ఉభయదేశాలమధ్యా పెరిగిన దూరాన్ని తగ్గించేందుకు ఉపకరిస్తుంది.సుంకాల సమ్మెటదెబ్బలతో సరిపెట్టకుండా, ఏవో పాతకక్షలూ కోపతాపాలూ ఉన్నట్టుగా అమెరికా అధ్యక్షుడు భారత్‌తో వ్యవహరిస్తున్న నేపథ్యంలో, చైనాతో మన దోస్తీ పెరుగుతోంది. ఉభయదేశాలూ గతంలో పరస్పరం విధించుకున్న శిక్షలూ ఆంక్షలను సడలించడమో, తొలగించడమో జరుగుతోంది. బీజింగ్‌నుంచి ఎరువుల సరఫరా తిరిగి మొదలైంది, చైనా పౌరులకు భారత్ టూరిస్టు వీసాలు ఇస్తోంది. భారత్%-%చైనా మధ్య నేరుగా విమానసర్వీసులు నడిపే ప్రయత్నం కూడా జోరందుకుంది. ఉభయదేశాల మధ్యా సరిహద్దు వివాదాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నప్పటికీ, ఉన్నతస్థాయిలోనే చేయాల్సిన కొన్ని కీలక నిర్ణయాలు ఇంకా మిగిలే ఉన్నాయి. చైనా విదేశాంగమంత్రి పర్యటన, భారత భద్రతాసలహాదారు అజిత్ దోభాల్‌తో భేటీ ఈ వివాదాల పరిష్కారానికి దోహదపడవచ్చునని ఆశ. ఇక, అక్టోబర్‌లో జరగనున్న షాంఘై సహకార సంఘం సదస్సుకు హాజరుకావాలని ప్రధాని నరేంద్రమోదీ నిర్ణయించుకున్నందుకు చైనా సంతోషిస్తోంది. చైనా దినపత్రిక గ్లోబల్ టైమ్స్ తన సంపాదకీయంలో మోదీని ప్రశంసిస్తూ, హిందీ చీనీ భాయిభాయి తరహాలో అనేక మంచిమాటలు రాసింది.భారత్ - చైనా మధ్య ఐదేళ్ళపాటు కొనసాగిన ఎడబాటు ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్ దయవల్ల, క్రమంగా తొలగిపోతోంది. భారత్‌ను తప్పుబట్టిన చైనానోటినుంచే ఇప్పుడు ప్రశంసలు వింటున్నాం. చైనాకు పోటీగా ఈ ప్రాంతంలో భారత్‌ను నిలబెట్టి, బలోపేతం చేసి, చైనా ఎదుగుదలనూ, విస్తరణవాదాన్నీ నియంత్రించాలన్న దశాబ్దాల అమెరికా వ్యూహాన్ని ట్రంప్ అతివేగంగా, స్వల్పకాలంలోనే తలకిందులు చేసేశారు. ట్రంప్ తొలివిడత ఏలుబడిలో మోదీతో పెరిగిన సాన్నిహిత్యం, భారత్‌మీద ఆయన కురిపించిన ప్రత్యేక ప్రేమలూ విస్మరించలేనివి. ట్రంప్ 'మగా', భారత్ 'మిగా' కలసి 'మెగా' అయిందంటూ మోదీ మొన్న ఫిబ్రవరిలో చేసిన ప్రసంగం ఆ దోస్తీకీ అద్దంపట్టింది. కానీ, కొద్దినెలల్లోనే గాలి తిరిగిపోయింది. ఆపరేషన్ సిందూర్‌ను ఆపింది నేనేనని ట్రంప్ చెప్పుకోవడం, అవును నిజమేనంటూ పాకిస్థాన్ ప్రశంసించడం, ఆప్తమిత్రుడు మోదీ మాత్రం దానిని కాదనడం, ముప్పైసార్లు అదేపనిగా చెప్పుకుంటున్నా అవునని తలూపకపోవడం తెలిసిందే. నోబెల్‌శాంతికి నూరుశాతం అర్హుడనని అనుకుంటున్న ట్రంప్ అహాన్ని దెబ్బతీసిన ఫలితమే ఈ సుంకాలూ భారత్‌కు డెడ్ ఎకానమీ అంటూ శాపాలూ అని విశ్లేషకుల వాదన. భారత్‌లాంటి మిత్రదేశాలను ట్రంప్ తన దూకుడు నిర్ణయాలతో దూరం చేసుకోవడం సరికాదని నిక్కీ హేలీ వంటివారు హితవులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో ఒక బలమైన సంఘటిత శక్తిని అమెరికా ఎదుర్కోవాల్సి వస్తుందని అక్కడి మాజీ భద్రతాసలహాదారులు భయపడుతున్నారు. పాతస్నేహాలను గాలికొదిలేసి, శత్రువుకంటే అన్యాయంగా ట్రంప్ పరిగణిస్తున్న ఫలితంగానే ఇప్పుడు రష్యాతో రాసుకుపూసుకోవడానికీ, చైనాతో చేయి కలపడానికీ భారత్‌కు మరింత వీలుకలిగింది. ఆరేళ్ళ తరువాత మోదీ చైనా పర్యటనకు సిద్ధపడటమే కాక, పుతిన్‌తో టెలిఫోన్ సంభాషణ, ఆయన అక్టోబర్‌లో వస్తూండటం మార్పుకు నిదర్శనం. ఈ పరిణామాలన్నీ అంతిమంగా రష్యా - ఇండియా - చైనా (ఆర్ఐసి) త్రైపాక్షిక కూటమి పునరుద్ధరణకు మార్గాన్ని సుగమం చేస్తాయని అమెరికా మీద ఆగ్రహంతో ఉన్న విశ్లేషకుల నమ్మకం.

## దీపావళికి చౌకగా కార్లు, బైకులు!

18 శాతం శ్లాబులోకి వస్తాయి.ప్రస్తుతం ప్యాసింజర్ కార్లపై 28 శాతం జీఎస్టీతో పాటు ఇంజిన్ సామర్థ్యం, పొడవును బట్టి 1 శాతం నుంచి 22 శాతం వరకు పరిహార సెస్సు విధిస్తున్నారు. దీనివల్ల మొత్తం పన్ను భారం 50 శాతం వరకు ఉంటోంది. అదేవిధంగా, ద్విచక్ర వాహనాలపై కూడా 28 శాతం జీఎస్టీ అమలవుతోంది. కొత్త విధానంలో 12 శాతం, 28 శాతం శ్లాబులను తొలగించనుండటంతో మాస్ మార్కెట్ కార్లు, బైకుల ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. అయితే, లగ్జరీ కార్లు వంటి కొన్ని వస్తువులపై 40 శాతం వరకు ప్రత్యేక పన్ను విధించే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు.ఈ దీపావళికి ప్రజలకు మేం ఓ బహుమతి అందిస్తున్నామని, సామాన్యులకు అవసరమైన వస్తువులపై పన్నులు భారీగా తగ్గుతాయని ప్రధాని మోదీ తెలిపారు. "దీనివల్ల రోజువారీ వస్తువులు చాలా చౌకగా మారతాయి. ఇది ఆర్థిక వ్యవస్థకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తుంది" అని ఆయన వివరించారు.పెరిగిన ఉత్పాదక వ్యయం, అధిక వడ్డీ రేట్ల కారణంగా కొన్నేళ్లుగా ఎంట్రీ-లెవెల్ కార్లు, బైకుల అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో పన్నులు తగ్గించాలని మారుతీ సుజుకీ, హీరో మోటోకార్ప్ వంటి ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలు చాలాకాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. జీఎస్టీ తగ్గింపు వార్తల నేపథ్యంలో నిఫ్టీ ఆటో ఇండెక్స్ ఒక్కరోజే 4.61 శాతం మేర లాభపడటం గమనార్హం.ద

## మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి తెలంగాణ హైకోర్టు నోటీసులు



ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు మే నెలలో తుది తీర్పును వెలువరించింది. 15 ఏళ్ల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్ధన్ రెడ్డి, బీవీ శ్రీనివాస్ రెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనుల శాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది.గాలి జనార్ధన్ రెడ్డి సహా నలుగురికి ఏడేళ్ల జైలు శిక్షను ఖరారు చేసింది. దోషులకు రూ. 10 వేల చొప్పున జరిమానా కూడా విధించింది. అలాగే ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి రూ. 2 లక్షల జరిమానా విధించింది. ఈ కేసులో, అప్పటి గనుల శాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రా రెడ్డికి, నాటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందకు సీబీఐ కోర్టులో ఊరట లభించింది. వారిని నిర్దోషులుగా ప్రకటించడంతో సీబీఐ హైకోర్టుకు వెళ్లింది.

# ఏపీలో నూతన బార్ పాలసీ కొత్త మార్గదర్శకాలు

**మొదటిపేజీ తరువాయి** - ఈ వ్యాపారంలోకి రావడానికి కొన్ని మార్పులు చేశామని వివరించారు. గతంలో బార్ లైసెన్స్ పొందాలంటే రెస్టారెంట్ లైసెన్స్ ముందే ఉండాలని.. ఈసారి ఈ నిబంధన సడలించామని చెప్పుకొచ్చారు. 15 రోజుల్లో రెస్టారెంట్ ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. 50 వేల లోపు జనాభా ఉంటే రూ.35 లక్షల లైసెన్స్ ఫీజు ఉంటుందని వెల్లడించారు ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్.50 వేల నుంచి 5 లక్షల జనాభా ఉంటే రూ.55 లక్షలు లైసెన్స్ ఫీజు ఉంటుందని చెప్పారు. అలాగే 5 లక్షలపైన జనాభా ఉంటే లైసెన్స్ ఫీజ్ రూ. 75 లక్షలు ఉంటుందని ప్రకటించారు. ప్రతి ఏడాది పదిశాతం ఈ ఫీజులు పెంచుతామని వెల్లడించారు. గతంలో ఒకేసారి ఆగస్టు నెలలోపు లైసెన్స్ ఫీజు కట్టాల్సి ఉండేదని గుర్తుచేశారు. ఈసారి ఆరుసార్లుగా చెల్లింపులు జరపవచ్చని సూచించారు. గతంలో బార్లు ఉదయం 11గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఉండేవని... ఈసారి ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు బార్లకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. అన్ని కేటగిరీల్లో దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలుగా నిర్ణయించామని ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ చెప్పుకొచ్చారు.గతంలో కేటగిరీలను బట్టి రూ.7.5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు ఉండేదని గుర్తుచేశారు. ఒక్కో బార్‌కి 27 దరఖాస్తులు గతంలోనే వచ్చాయని.. కొన్ని బార్‌లకు 131 దరఖాస్తులు వచ్చాయని స్పష్టం చేశారు. కొన్ని చోట్ల మద్యం సిండికేట్లు కొత్త వారిని రాకుండా చేసే అవకాశం ఉందని... వాటిని ఆపేందుకు కొత్త నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడించారు. లైసెన్స్ ఫీజు 70 నుంచి 50 శాతానికి తగ్గాయని వివరించారు. సోమవారం నుంచి ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ నెల 28వ తేదీన కలెక్టర్ లాటరీ తీసి ట్రాన్స్‌పరెంట్‌గా బార్లు కేటాయిస్తారని.. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి కొత్త పాలసీ అందుబాటులోకి వస్తోందని ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు.

# కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ



**మొదటిపేజీ తరువాయి** - విశాఖపట్నంలో డేటా సిటీని అభివృద్ధి చేయడం వల్ల భవిష్యత్తులో ఏపీ టెక్నాలజీ హబ్ గా తయారవుతుందని చెప్పారు. దీనికి సహకారం కావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వెళ్లే కార్మికుల సంక్షేమం, భద్రత, గౌరవాన్ని కల్పించేందుకు ప్రవాస భారతీయ బీమా యోజన వంటి పథకాలను విస్తరించాలని, సంబంధిత ఫిర్యాదుల పరిష్కారం కోసం ఏపీలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఏపీలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి స్కిల్ కాంక్లేవ్ నిర్వహణలో భాగస్వామ్యం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.వలస కార్మికులకు ఓవర్సీస్ ట్రైనింగ్, మైగ్రేషన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కోసం ఫాస్ట్ ట్రాక్ అనుమతులతో పాటు నిధులు మంజూరు చేయాలని మంత్రి నారా లోకేశ్ కోరారు. ఇటీవల సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బృందం సింగపూర్ పర్యటన వివరాలు.. వివిధ రంగాల్లో రాష్ట్ర అభివృద్ధికి సింగపూర్ ప్రభుత్వంతో జరిగిన చర్చల గురించి లోకేశ్ వివరించారు. దీనికి మీ పూర్తి సహకారం కావాలని లోకేశ్ మంత్రి జైశంకర్‌ను కోరారు.ఏపీకి చెందిన సుమారు 35 లక్షల మంది ప్రవాసాంధ్రులు విదేశాల్లో ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఉన్నారు. అమెరికాలో 10 లక్షలు, గల్ఫ్ దేశాల్లో 8 లక్షలు, ఐరోపా దేశాల్లో 4 లక్షల మంది ప్రవాసాంధ్రులు ఉన్నారు. యూఎస్ లో అక్కడి ప్రజల తలసరి ఆదాయం 70 వేల డాలర్లు కాగా, ప్రవాసాంధ్రుల తలసరి ఆదాయం 1,26,000 డాలర్లుగా ఉందన్నారు.ఐరోపా దేశాలు, ఆస్ట్రేలియా, జపాన్, కొరియా, తైవాన్ లతో మొబిలిటీ, మైగ్రేషన్ భాగస్వామ్యాలను ఏర్పాటు చేయడంలో కేంద్ర చర్యలు అభినందనీయమని, ప్రపంచ నైపుణ్య రాజధానిగా భారత్ ను తీర్చిదిద్దే ప్రయత్నాలకు ఏపీ పూర్తి మద్దతునిస్తుందని తెలిపారు. కార్మికుల భద్రత, ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి అవసరమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించడం, రాష్ట్రస్థాయిలో ఆయా ఒప్పందాలను అమలు చేయడంలో ఏపీ ముందంజలో ఉంటుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.స్కిల్ డెవలప్ మెంట్, ఇన్‌స్టిట్యూషనల్ పార్టనర్ షిప్స్ కోసం నైపుణ్య భాగస్వామ్యాలను అభివృద్ధి చేయడంలో ఏపీ ప్రభుత్వం చురుగ్గా పనిచేస్తోందని తెలిపారు. ఇందులో రష్యా, ఆస్ట్రేలియా వంటి దేశాలతో కలిసి జాయింట్ ట్రైనింగ్ అండ్ ఎసెస్ మెంట్ పై ట్విన్నింగ్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. వివిధ పారిశ్రామిక సంస్థలు, ఉద్యోగార్థులను అనుసంధానించే ఏకీకృత వేదికగా నైపుణ్యం పోర్టల్ ను త్వరలో ప్రారంభించబోతున్నామని తెలిపారు. నైపుణ్యం కలిగిన యువతకు విదేశాల్లో ఉద్యోగావకాశాలను కల్పించడానికి, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రప్పించడానికి జపాన్, కొరియా, తైవాన్లతో కలిసి మైగ్రేషన్ అండ్ మొబిలిటీ పార్టనర్ షిప్ అరేంజ్ మెంట్ ఉమ్మడి ప్రాజెక్టుల ఏర్పాటుపై దృష్టి సారించామని వివరించారు. ఏపీ యువతకు మెరుగైన విదేశీ ఉద్యోగావకాశాల కల్పనకు కేంద్రం నుంచి రాష్ట్రానికి డేటా షేరింగ్ సహకారాన్ని అందించాల్సిందిగా కేంద్రమంత్రి జైశంకర్ కు మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

# గత ప్రభుత్వం చేసిన చట్టమే మనకు అడ్డంకి

**మొదటిపేజీ తరువాయి** -

చరిత్ర, స్ఫూర్తి, కోటను చారిత్రక కట్టడాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించామన్న సీఎం రేవంత్ రెడ్డి, భవిష్యత్తు తరాలు గర్వించేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. గాంధీ కుటుంబం దేశానికి గొప్ప వరమని, శాంతితో యుద్ధాన్ని గెలవవచ్చు అని ఆయన నిరూపించారని అన్నారు. విద్య, ఉద్యోగాల్లో బహుజనులు ఆర్థికంగా ఎదగాలనేది రాహుల్ గాంధీ విధానమని, ఆయన పాలసీని అమలు చేయడమే తన బాధ్యత అని అన్నారు. రాహుల్‌గాంధీ సూచనను నూరు శాతం అమలు చేస్తామని, ఆ క్రమంలో సమస్యలు వస్తే పోరాటంలో ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.అసెంబ్లీ సాక్షిగా సవాల్ విసిరాం : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని గతంలో రాహుల్‌గాంధీ మాట ఇచ్చారని, గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనమే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా కులగణన సర్వే చేశామన్న సీఎం, కులగణన సర్వేలో తప్పులుంటే చూపాలని రాజకీయ పార్టీలకు సవాల్ విసిరినట్లు తెలిపారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు అసెంబ్లీ సాక్షిగా సవాల్ విసిరామని, తప్పులు చూపితే క్షమాపణ చెబుతామని చెప్పినట్లు వెల్లడించారు."దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా కులగణన సర్వే చేశాం. కులగణన సర్వేలో తప్పులుంటే చూపాలని రాజకీయ పార్టీలకు సవాల్ విసిరాం. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు శాసనసభ వేదికగా సవాల్ విసిరాం. తప్పులు చూపితే క్షమాపణ చెబుతామని చెప్పాం".రాజకీయ ప్రయోజనాల కోసం కులగణనను తప్పుపట్టవద్దన్న రేవంత్,? కులగణను తప్పుపడితే వందేళ్ల వరకు బహుజనులకు న్యాయం జరగదన్నారు. ప్రతి 150 ఇళ్లకు ఎన్యుమరేటర్లను పెట్టి బ్లాక్‌గా విభజించామని, 95 వేల బ్లాకుల్లో ఇంటింటి సర్వేను 60 రోజుల్లో చేసినట్లు తెలిపారు. క్షుణ్నంగా, లోతుగా దేశంలో ఏ ప్రభుత్వం కులగణన సమాచారం సేకరించలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 56.33 శాతం బలహీనవర్గాలు ఉన్నాయని, బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఐదు నెలలుగా పెండింగ్ పెట్టిందని విమర్శించారు.మనకు అడ్డంకిగా మారింది : బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ కలిపితే రిజర్వేషన్లు 70 శాతం వరకు చేరుతాయని, తెలంగాణలో 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం చట్టం చేసిందని రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. గత ప్రభుత్వం చేసిన చట్టం మనకు అడ్డంకిగా మారిందని, బీసీ రిజర్వేషన్ల కోసం జంతర్ మంతర్ వేదికగా నిరసనలు తెలిపినట్లు గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ, బీఆర్ఎస్ మద్దతు ఇవ్వలేదని, సమస్యలు పరిష్కరించే శక్తి ఉన్నా మోదీ, కిషన్‌రెడ్డిలు అడ్డుపడుతున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లలో ముస్లింలను కలిపారని తొండి వాదన చేస్తున్నారన్న ఆయన, మత ప్రాదిపదికన రిజర్వేషన్లకు తావులేదని రాజ్యాంగంలోనే ప్రొవిజన్ ఉందని అన్నారు.బలహీన వర్గాలకు అన్యాయం : బీసీ రిజర్వేషన్లలో మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉంటే చూపాలని, అబద్ధాలతో బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం చేస్తున్నారని సీఎం రేవంత్? రెడ్డి మండిపడ్డారు. గుజరాత్‌లో ముస్లింలకు బీసీ రిజర్వేషన్లను మోదీ తొలగించగలరా? ముస్లిం, వెనుకబడిన వర్గాలకు రాష్ట్రంలోనూ బీసీ రిజర్వేషన్లే ఉన్నాయని, ముస్లిం ముసుగుతో బహుజనులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రాహుల్‌గాంధీపై కోపం ఉంటే వారి మీద ప్రదర్శించాలని, ఆయనపై ఇప్పటికే చాలా కేసులు పెట్టారని అవసరమైతే మరో 4 పెట్టండని అన్నారు. రాహుల్ నమ్మిన సిద్ధాంతాన్ని దెబ్బతీయవద్దని కేంద్రాన్ని కోరుతున్నట్లు ప్రసంగాన్ని ముగించారు.

# తీరాన్ని దాటనున్న వాయుగుండం ఏపీకి వర్ష సూచన



**మొదటిపేజీ తరువాయి** - బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం మరింత బలపడి కోస్తాంధ్ర వైపు దూసుకొస్తోంది. ఇది మంగళవారం ఉదయానికి వాయుగుండంగా మారి దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో కోస్తాంధ్ర జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేశారు.వాయుగుండం ప్రభావంతో తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. పరిస్థితులు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున, మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లరాదని ఆయన స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ వాయుగుండం కారణంగా మంగళవారం కోస్తాంధ్రలోని పలు ప్రాంతాల్లో చెదురుమదురుగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని తెలిపారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు.ఇప్పటికే అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం సాయంత్రం 5 గంటల సమయానికి అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో అత్యధికంగా 73 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురంలో 66 మి.మీ, శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసలో 60.2 మి.మీ, అల్లూరి జిల్లా కొత్తూరులో 59.5 మి.మీ చొప్పున వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు.

# వయసు కంటే ముందే రక్తనాళాలకు వృద్ధాప్యం

**మొదటిపేజీ తరువాయి** -

కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించి ఏళ్లు గడుస్తున్నా, దాని దీర్ఘకాలిక ప్రభావాలు ఒక్కొక్కటిగా బయటపడుతూ ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా జరిపిన ఒక విస్తృత స్థాయి అధ్యయనంలో కోవిడ్ ఇన్ఫెక్షన్, అది తేలికపాటిది అయినా సరే, మన రక్తనాళాలను వయసు కంటే ముందే బలహీనపరిచి, గుండెపోటు, పక్షవాతం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యల ముప్పును పెంచుతున్నట్లు వెల్లడైంది. ఈ ప్రభావం పురుషుల కంటే మహిళల్లో ఎక్కువగా ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు.ఫ్రాన్స్‌లోని పారిస్ సిటీ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రోసా మరియా బ్రూనో నేతృత్వంలోని పరిశోధక బృందం ఈ అధ్యయనం నిర్వహించింది. 16 దేశాలకు చెందిన సుమారు 2,390 మందిపై సెప్టెంబర్ 2020 నుంచి ఫిబ్రవరి 2022 మధ్య పరిశోధనలు జరిపారు. "కోవిడ్ వైరస్ నేరుగా రక్తనాళాలపై ప్రభావం చూపుతుందని మాకు తెలుసు. దీనివల్ల రక్తనాళాలు వయసు కంటే వేగంగా వృద్ధాప్యానికి గురవుతాయి. ఫలితంగా గుండె సంబంధిత వ్యాధుల బారిన పడే ప్రమాదం పెరుగుతుంది" అని ప్రొఫెసర్ బ్రూనో వివరించారు. ఈ అధ్యయన ఫలితాలను ప్రతిష్ఠాత్మక యూరోపియన్ హార్ట్ జర్నల్‌లో ప్రచురించారు.కోవిడ్ సోకని వారితో పోలిస్తే, ఇన్ఫెక్షన్‌కు గురైన వారందరిలో... ముఖ్యంగా మహిళలు, లాంగ్ కోవిడ్ లక్షణాలతో (ఆయాసం, అలసట వంటివి) బాధపడుతున్న వారిలో రక్తనాళాలు లేదా ధమనులు గట్టిపడినట్లు ఈ అధ్యయనంలో స్పష్టంగా తేలింది. అయితే, కోవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న వారిలో ధమనులు అంతగా గట్టిపడలేదని, వారి పరిస్థితి కాస్త మెరుగ్గా ఉందని కూడా పరిశోధకులు గుర్తించారు.మహిళల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉండటానికి వారి రోగనిరోధక వ్యవస్థ పనితీరే కారణం కావచ్చని ప్రొఫెసర్ బ్రూనో అభిప్రాయపడ్డారు. "మహిళల రోగనిరోధక వ్యవస్థ వేగంగా, బలంగా స్పందిస్తుంది. ఇది ఇన్ఫెక్షన్ నుంచి వారిని కాపాడుతుంది. కానీ, అదే బలమైన స్పందన ఇన్ఫెక్షన్ తర్వాత రక్తనాళాలకు ఎక్కువ నష్టం కలిగించవచ్చు" అని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో, కోవిడ్ బారిన పడిన వారిలో గుండె సంబంధిత ముప్పును ముందుగానే గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

## భారత్‌కు అమెరికా తీవ్ర హెచ్చరిక



రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్న విషయంలో భారత్‌పై అమెరికా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ చర్యలను తక్షణమే నిలిపివేయాలని, లేనిపక్షంలో అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్య హోదాపై ప్రభావం పడుతుందని వైట్‌హౌస్ వాణిజ్య సలహా దారు పీటర్ నవారో హెచ్చరించారు. అయితే, ఈ ఆరోపణలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. తమను అన్యాయంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని, అమెరికా సహా ఐరోపా దేశాలు కూడా రష్యాతో ఇప్పటికీ వాణిజ్యం చేస్తున్నాయని గుర్తు చేసింది.'ఫైనాన్షియల్ టైమ్స్' పత్రికలో రాసిన ఒక వ్యాసంలో పీటర్ నవారో ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి భారత్ చమురు కొనడం వల్ల, పరోక్షంగా ఉక్రెయిన్‌పై మాస్కో చేస్తున్న యుద్ధానికి నిధులు సమకూరుస్తున్నట్టే అవుతుందని ఆయన ఆరోపించారు. "భారత్ ఒకే సమయంలో రష్యా, చైనాలతో సన్నిహితంగా మెలుగుతోంది. అమెరికాకు వ్యూహాత్మక భాగస్వామిగా కొనసాగాలనుకుంటే, అందుకు తగినట్టుగా భారత్ ప్రవర్తించడం మొదలుపెట్టాలి" అని ఆయన స్పష్టం చేశారు.నవారో చేసిన వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందిస్తూ, తమ దేశ ప్రయోజనాలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొంది. కేవలం భారత్‌ను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం సరికాదని, అమెరికా, ఐరోపా సమాఖ్య దేశాలు కూడా రష్యాతో వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తున్న విషయాన్ని ప్రస్తావించింది. ఈ పరిణామంతో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి.భారత్-అమెరికా మధ్య 25-29 తేదీల్లో జరగాల్సిన వాణిజ్య చర్చలు రద్దయిన తర్వాత పీటర్ నవారో ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో ట్రంప్ విధించిన అదనపు టారిఫ్‌లు ఈ నెల 27 నుంచి అమలులోకి రానున్నాయి. దీంతో భారత వస్తువులపై అమెరికా సుంకాలు 50 శాతానికి చేరనున్నాయి.ద

## కేంద్రం నుంచి 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాలి



కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సిన యూరియా విషయంలో జాప్యాన్ని నిరసిస్తూ పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలందరు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందని.. అందుకే తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎంపీలందరం వాయిదా తీర్మానం ఇచ్చామని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి వెల్లడించారు. రాష్ట్రానికి ఇవ్వాల్సిన 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇవ్వాలంటూ పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలందరు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం వెంటనే యూరియా సరఫరా చేయాలని మేము డిమాండ్ చేశారు. ఎన్నిసార్లు కోరినప్పటికీ కేంద్రం జాప్యం చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. రైతులు ఇప్పటికే పెద్ద ఎత్తున్న ఆందోళన చేస్తున్నారని.. రాష్ట్ర సమస్యను లేవనెత్తాలనుకున్నప్పుడల్లా పార్లమెంట్ వరుసగా వాయిదా వేస్తూ వచ్చారని తెలిపారు. 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి రాష్ట్రం కోసం ఏం చేస్తున్నారని నిలదీశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.ప్రస్తుతం కేంద్ర ఎరువుల రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డా అపాయింట్మెంట్ కోరినట్లు వెల్లడించారు. ఫెర్టిలైజర్స్ స్టాండింగ్ కమిటీలో యూరియా విడుదల చేయాలని కోరుతామని ఎంపీ మల్లు రవి అన్నారు. అపాయింట్మెంట్ ఇవ్వకపోతే నడ్డా కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ బీజేపీ ఎంపీలకు సైతం కేంద్రమంత్రి నడ్డాకు ఇచ్చే లేఖను అందజేస్తామని పేర్కొన్నారు. రామగుండంలో ఫెర్టిలైజర్ కంపెనీ ఉంటే ఢిల్లీ నోయిడాలో కూర్చొని అధికారులు విధులు నిర్వహిస్తున్నారని ఈ సందర్భంగా ఎంపీ బలరాం నాయక్ తెలిపారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
మంగళవారం 19 - 08 - 2025

## "" స్వేచ్ఛా కాగితాలు ""



బ్రతుకునంతా బందీ చేసి
కలల కొలువుకై కష్టపడి
పరీక్షకు పయనమయితే
ముందు రోజే స్వేచ్ఛ పొంది
నిరుద్యోగిని నిండా ముంచిన
ప్రభుత్వోద్యోగ ప్రశ్నా కాగితాలు

ఆర్థిక అవకతవకల దోపిడీకి అడుగడుగున స్వేచ్ఛనిచ్చి
అబద్ధాగ్ని ప్రమాదంలో మిగలకుండా తగులబడిన
రక్షణలేని అధికారిక అభివృద్ధిపనుల కాగితాలు

యువత చేతిలో ఇమడలేక
గ్రంథాలయ మందిరాల్లో
చెదల నోటికి విడువబడిన
స్వాతంత్ర్య సమర వీరుల
చెల్లని చరిత్రా కాగితాలు

బ్రతికున్నోడి సావు జేసి
ప్రజాస్వామ్య పరువు తీసి
అసమర్థులను గెలిపించే
దొంగ ఓటు కాగితాలు

డెబ్భైతొమ్మిది వసంతాల స్వాతంత్ర్య భారతావని
సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని
సవాలంటూ సిగ్గులేక దేశమంతా తిరుగుతున్నవే
ఈ స్వేచ్ఛా కాగితాలు.

**నేపా. సంతోష్ అచ్యుత్ కుమార్,**
అసిస్టెంట్ ప్రొఫెసర్, కాళోజి ప్రతిభ పురస్కార గ్రహీత. 8639442397.

---

# ప్రభుత్వం స్కూల్ విద్యార్థుల కు ఉచిత పుస్తకాల పంపిణీ

## టీం వి ఫర్ యు ఫౌండేషన్



**సికింద్రాబాద్, బహుజన్ న్యూస్:** రఘునందన్ మామిళ్లపల్లె సహకారంతో టీం వి ఫర్ యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు ఉచిత పుస్తకాలు 100 మంది విద్యార్థుల కు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం తుకారం గేట్ అడ్డగుట్ట గవర్నమెంట్ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు పుస్తకాలు అందజేసిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ భానుమతి, ఫౌండర్ రామ్, ఎఫ్ టీ పి సి మీడియా డైరెక్టర్ చంద్రశేఖర్, ఎఫ్ టీ పి సి మీడియా చైర్మన్ కిరణ్, హెల్త్ & ఫిటినెస్ & మోటివేషన్ అనుప్రసాద్ , ముత్తు మంజుల, ఉదయ్ కుమార్, శివాజీ, నవనీత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షురాలు భానుమతి సుంకరి మాట్లాడుతూ "పేద విద్యార్థులకు నోట్స్ బుక్స్ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది అని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి భవిష్యత్తు సాధించాలి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు కదిరి కుమార్, రామ్ సుంకరి, తన్వి పాల్గొన్నారు.

# విపత్కర పరిస్థితుల లో అండగా ఉంటాం.మీర్ వాజిద్ అలీ సామాజిక కరియకర్త

## రక్త దాత భూమా రెడ్డి కల్లూర్



**ముధోల్:ఆగష్టు 18:తెలంగాణ సేన న్యూస్ :** ముధోల్ గ్రామానికి చెందిన మీర్ ఫుర?న్ అలీ అనారోగ్యంతో బాధపడుతున్న తరుణంలో రెగ్యులర్ డోనార్ భూమారెడ్డి కల్లూరు కి కాల్ చేసిన వెంటనే వర్షాన్ని కూడా లెక్కచేయకుండా జీవన్ దాన్ రక్తనిధి కేంద్రానికి చేరుకొని తన అమూల్యమైన రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త మీర్ వాజిద్ అలీ మాట్లాడుతూ యువకులు ఇలాంటి విపత్కర సమయంలో ప్రజలకు అండగా ఉండాలని కోరారు తమ అమూల్యమైన రక్తాన్ని ప్రతి మూడు నెల కు ఒకసారి దానం చేయాలని కోరారు భూమరెడ్డి స్పందనకు సామాజిక కార్యకర్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సయ్యద్ అంజద్ ,శనే కిరణ్, అదిల్, సల్మాన్ , తల్లహ, మోసిన్ జీవన్ దన్ ల్యాబ్ టెక్నీషియన్ గోపి ఉన్నారు.

# ల్యాబ్ టెక్నీషియన్ ను అటు ఇటు తిప్పడం మానేయండి

## ఇబ్బంది పడుతున్న ప్రజలు ( రోగులు

## నర్సంపేట ఏరియా హాస్పిటల్ లో



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన. :** నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కలదు ఇక్కడికి పేషెంట్లు ( రోగులు ) స్థానిక పట్టణం, నల్లవెల్లి ఏజెన్సీ ప్రాంతాలు కొత్తగూడ & గంగారం ఖానాపురం నెక్కొండ దుగ్గొండి నల్లబెల్లి మండలాల నుండి రోగులు వైద్యం కోసం వస్తుంటారు రోగ నిర్ధారణ కోసం వర్షాకాలంలో సీజన్ ప్రారంభమై రోగములతో బాధపడుతున్న ప్రజలు టెస్టులు రిపోర్టులు సమయానికి రాక రోగస్తులు ఇబ్బంది పడుతున్నారు . మలేరియా డెంగ్యూ చికెన్ గున్యా గర్భిణీ స్త్రీలు విపరీతంగా రావడం వారి టెస్టులు ఇబ్బంది ఏర్పడడం జరుగుతుంది. గంటలకు కొద్దీ రిపోర్టు కోసం వేచి ఉంటున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ ఒకరు ఇక్కడ ల్యాబ్ ఒకరు సెలవులో ఒక టెస్టులు ఒకరి రిపోర్టులు ఇవ్వడం జరుగుతుంది సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ గవర్నమెంట్ నర్సంపేట విభాగానికి చెందిన వ్యక్తిని డిప్యూటేషన్ చెన్నారావుపేట మండలం (%ూఎజ%). హాస్పటల్ నందు స్కూల్లలో బ్లడ్ టెస్ట్ లు పేషంటు రోగులు బాధపడుతున్న సమయంలో ల్యాబ్ టెక్నీషియన్ వేయడం వలన నర్సంపేట హాస్పిటల్ పేషెంట్లు రోగులు ఇబ్బంది పడుతున్నారు ల్యాబ్ టెక్నీషియన్ డిప్యూటేషన్ రద్దు చేసి అతన్ని సేవలు హాస్పిటల్ నందు వినియోగించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తహసిల్దార్ కు వినతి



**ముధోల్,18ఆగస్టు(తెలంగాణ సేన న్యూస్) :** నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ లో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ముధోల్ గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ శ్రీలతకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు సుమా రు 6 నెలలుగా నుండి అవస్థలు పడుతున్నారన్నారు. కొత్త ఆధార్ కార్డుల కోసం దర ఖాస్తు చేసుకోవాలన్నా,ఇప్పటికే ఉన్న కార్డుల్లో తప్పులను స రిదిద్దాలన్నా, కొత్త పెళ్లి చేసుకుని వచ్చినవారి చిరునామా మార్పు చేయాలన్నా భైంసా పట్టణానికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఆధార్ సెంటర్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో రౌఫ్, ఆఫ్రోజ్, మైమూద్,అబ్దుల్ రహీమ్,షాబాజ్ ఖాన్,సిరాజ్ తో పాటు తదితరులు ఉన్నారు.

# ప్రజా ప్రదేశాల్లో అధిక శబ్ద పరికరాలు(డిజే) వినియోగంపై నిషేధం

## ఉల్లంఘన చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు

## జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్



**నిర్మల్:ఆగష్టు 18:తెలంగాణ సేన న్యూస్.:** నిర్మల్ జిల్లా పరిధిలో డిజేలు (హై వాల్యూం మిక్సర్లు), లౌడ్ స్పీకర్లు, సౌండ్ యాంప్లిఫైయర్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ వంటి అధిక శబ్ద పరికరాలను ప్రజా ప్రదేశాలలో వినియోగించడం పై జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ పలు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. జిల్లాలోని కొన్ని వాణిజ్య సంస్థలు ఇటువంటి పరికరాలను తయారు చేస్తూ కిరాయికి ఇవ్వటం వల్ల ప్రజలకు అసౌకర్యం, చిరాకు కలిగించడం తో పాటు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి.

**చట్టపర నిబంధనల ప్రకారం:....**

పగటి వేళల్లో (ఉ. 6:00– రా. 10:00) నివాస ప్రాంతంలో 55 డెసిబెల్స్, వాణిజ్య ప్రాంతంలో 65 డెసిబెల్స్ శబ్ద పరిమితి మాత్రమే అనుమతించబడింది. రాత్రి 10:00 గంటల నుండి ఉదయం 6:00 గంటల వరకు డిజేలు, లౌడ్ స్పీకర్లు, సౌండ్ యాంప్లిఫైయర్లు వాడరాదు.

సైలెంట్ జోన్లలో ఎట్టి పరిస్థితుల్లోనూ లౌడ్ స్పీకర్లు, డిజేలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ వినియోగించరాదు. ఎవరైనా లౌడ్ స్పీకర్లు లేదా డిజేలను వాడాలనుకుంటే సంబంధిత సబ్ డివిజన్ పోలీస్ అధికారి ) నుండి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలి. ఉల్లంఘన చేసిన వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయి. నిర్మల్ జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల స్టేషన్ హౌస్ అధికారులకు ఈ ఆదేశాలను అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్మల్ జిల్లా పోలీసులు ప్రజలను విజ్ఞప్తి చేస్తూ తగు సూచనలు.. శబ్ద కాలుష్యం నియంత్రణలో భాగస్వాములై సహకరించండి.చట్టం విరుద్ధంగా అధిక శబ్ద పరికరాలను వాడవద్దు. ఉల్లంఘన చేస్తే కఠిన చర్యలు తప్పవు. అని విజ్ఞప్తి చేశారు. పక్క రాష్ట్రాల నుండి ఇవి తీసుకువచ్చి వాడుతున్నట్లయితే 100 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలి అని కోరారు.

# ప్రజాస్వామ్యానికీ, ఈసిఐకీ మధ్య పెరిగిన అంతరం




**నిర్మల్:ఆగష్టు 18:తెలంగాణ సేన న్యూస్. :** భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ఈ ప్రజాస్వామ్యానికి ప్రధాన స్తంభం ఎన్నికల కమిషన్. ఇది స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించి, ప్రజల ఓటు హక్కును పరిరక్షించాల్సిన రాజ్యాంగబద్ధమైన సంస్థ. అయితే, ఇటీవల కాలంలో ఎన్నికల కమిషన్ పనితీరుపై ప్రతిపక్షాలు, ముఖ్యంగా ఇండియా కూటమి నేతలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఇది దేశంలో ప్రజాస్వామ్య భవిష్యత్తుపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది.

**ఈసీ ప్రెస్ మీట్.. స్పష్టతపై గందరగోళం**

ఇటీవల ఈసీ నిర్వహించిన ప్రెస్ మీట్ తర్వాత ఈ విమర్శలు మరింత పెరిగాయి. ఇండియా కూటమి నేతలు ఈసీ ప్రెస్ మీట్‌లో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని, తమ ఆరోపణలకు సరైన సమాధానం లభించలేదని అంటున్నారు. ముఖ్యంగా, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై ఆధారాలు లేవని, ఆయన క్షమాపణ చెప్పాలని ఈసీ పేర్కొనడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఈసీ స్వతంత్రతను, నిష్పక్షపాత వైఖరిని ప్రశ్నిస్తోంది. ఒక రాజ్యాంగబద్ధమైన సంస్థ రాజకీయ పార్టీలాగా విమర్శలకు ప్రతివిమర్శలు చేయడం సరికాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వాస్తవాలు లేకుండా ఆరోపణలు చేసినందుకు రాహుల్ గాంధీపై ఈసీ చర్యలు తీసుకోవచ్చు, కానీ అదే సమయంలో ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ఆరోపణలు నిజమైతే, ఈసీ కూడా సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉంది.

**సుప్రీంకోర్టు ఆదేశాలు– ఈసీ వివరణ**

సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత కూడా ఈసీ సరైన వివరణ ఇవ్వలేదనేది ఇండియా కూటమి యొక్క ప్రధాన విమర్శ. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల వివరాలను బయటపెట్టాల్సిన బాధ్యత ఈసీపై ఉంది. కానీ, ఆ వివరాలను బహిరంగపరచకుండా, ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం ఈసీ నైతికతను కోల్పోయిందని సూచిస్తోంది. ఒకవైపు ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌ది అయితే, మరోవైపు అది ఒక పార్టీకి అనుకూలంగా పనిచేస్తుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుప్రీంకోర్టుకు సమర్పించిన వివరాలపై ఈసీ ఎందుకు వివరణ ఇవ్వడం లేదనేది ప్రధాన ప్రశ్న.

**ఓటర్ల జాబితాలో అక్రమాలు, ఈవీఎంల భద్రత**

తమిళనాడులో 6.5 లక్షల ఓటర్లు, బీహార్‌లో 60 లక్షల మందికి పైగా ఓటర్లు మిస్ అయ్యారనే ప్రతిపక్షాల ఆరోపణలు తీవ్రమైనవి. ఇలాంటి ఆరోపణలపై జవాబుదారీగా ఉండాల్సింది ఎన్నికల కమిషన్ మాత్రమే. కానీ, ఈసీ ఈ అంశాలపై స్పందించడం లేదని కూటమి ఆరోపిస్తోంది. అలాగే, ఎన్నికలు జరిగిన తర్వాత ఓట్ల లెక్కింపు వరకు ఈవీఎంలను భద్రంగా ఉంచాల్సిన బాధ్యత కూడా ఈసీదే. ఒకవేళ ఏవైనా తప్పుడు లెక్కింపులు జరిగి, ఆ అభ్యర్థి సుప్రీంకోర్టుకు వెళ్తే, ఈసీ వాటిని మళ్ళీ లెక్కించాల్సి వస్తుంది. అలాంటప్పుడు ఓటింగ్ యంత్రాల భద్రతను నిర్ధారించడం ఈసీ ప్రాథమిక విధి. ఈ విషయంలో కూడా ఈసీ మీద నిఘా లోపం ఉందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. మహాదేవపుర ఓటర్ల మోసంపై కూడా ఈసీ సరైన సమాధానం ఇవ్వలేదనేది ఇండియా కూటమి యొక్క ప్రధాన ఆరోపణ.

**అధికార పార్టీ–ఈసీ సంబంధాలు, బెదిరింపుల ఆరోపణలు**

ఇండియా కూటమి నేతలు ఈసీపై మరో తీవ్రమైన ఆరోపణ చేస్తున్నారు. అధికార పార్టీని ప్రశ్నించే ప్రతిపక్ష నేతలను ఈసీ బెదిరిస్తోందని వారు వాదిస్తున్నారు. ఒక స్వతంత్ర సంస్థగా ఈసీకి ఇలా బెదిరించే అధికారం ఎక్కడిది? ఒకవేళ ఈ ఆరోపణలు నిజమైతే, దీనిపై స్వతంత్ర దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేసి, వాస్తవాలను బయట పెట్టాలి. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలంటే ఈసీ పనితీరుపై సుప్రీంకోర్టు ద్వారానే వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉంది.

ఈ పరిణామాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థ భవిష్యత్తుపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఎన్నికల కమిషన్ తన స్వతంత్రతను, నిష్పక్షపాత వైఖరిని నిరూపించుకోవాల్సిన సమయం ఇది. లేకపోతే, ప్రజల విశ్వాసం కోల్పోయి, ప్రజాస్వామ్య మూలాలకే ప్రమాదం ఏర్పడవచ్చు. ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని, వాస్తవాలను బయటపెట్టాలని దేశం కోరుకుంటోంది.

**విమర్శలకు దిగడం– రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన**

?ప్రతిపక్ష నేతలపై ఈసీ బెదిరింపులకు పాల్పడుతుందని ఇండియా కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. ఒకవేళ ఈ ఆరోపణలు నిజమైతే, ఇది పౌరుల భావ ప్రకటన స్వేచ్ఛ (ఆర్టికల్ 19), ప్రశ్నించే హక్కులకు విరుద్ధం. ఒక రాజ్యాంగబద్ధమైన సంస్థకు ప్రజలు లేదా రాజకీయ నాయకులు ప్రశ్నలు వేసే హక్కు ఉంటుంది. ఆ ప్రశ్నలను బెదిరింపులతో అణిచివేయడానికి ప్రయత్నించడం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుంది. ఇది ప్రజాస్వామ్యానికి ప్రధాన సూత్రమైన జవాబుదారీతనాన్ని దెబ్బతీస్తుంది.

**వెంక గారి భూమయ్య**
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ
9848559863



# రాష్ట్రంలో భారీ వర్షాలు పొంగి పొర్లుతున్న వాగులు

## తెలంగాణ రాష్ట్ర రూలర్ డెవలప్మెంట్ డైరెక్టర్ చల్ల నారాయణరెడ్డి



**కొత్తగూడ తెలంగాణ సేన :ప్రజలు** అధికారులు అప్రమత్తంగా ఉండాలి వాతావరణ కేంద్రం మరో మూడు రోజులు భారీ వర్షాలు. ప్రయాణికులు మీయొక్క ప్రయాణాన్ని వాయిదా వేసుకోండి వాగులు దాటె ప్రయత్నం చేయరాదు ప్రజలు స్వీయ రక్షణలో ఉండాలి. చేపల వేటకు వెళ్ళరాదు వరద ఉధృతి ఎక్కువగా ఉన్నది. కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాలలో లింకు రోడ్డు కల్వర్టులు దెబ్బతిన్నాయి. అక్కడక్కడ గుంతలలో నీటితో నిండబడినందువలన ఫోర్ వీలర్ మరియు టు వీలర్ ప్రయాణం చేసేటప్పుడు తగు జాగ్రత్తగా గుంతలను గమనించండి. విద్యుత్ స్తంభాలను విద్యుత్ తీగలను తాకవద్దు వాటికి తగు దూరంలో ప్రయాణం చేయండి. మీ పాడి పశువులను ఎప్పటికప్పుడు గమనించండి.. మీ యొక్క మొబైల్ ఫోన్లను చార్జింగ్ పెడుతూ ఫోన్ కాల్స్ మాట్లాడరాదు... చార్జింగ్ పెడుతూ మొబైల్ ఫోన్ చూడరాదు...

అవసరమైతే తప్ప విద్యుత్ ను వినియోగించుకోండి.. మీ పరిసర ప్రాంతాలలో విద్యుత్ తీగలను గమనించండి మీరు మీ పిల్లలను ఇంట్లోనే ఉండండి పిల్లలను గమనిస్తూ ఉండండి చెరువు అలుగుల వద్దకు మరియు వాగుల వద్దకు వెళ్ళనివ్వకండి.మన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ అనసూయ సీతక్క వారు నియోజకవర్గంలోని అన్ని జిల్లా కేంద్రంలోని మండలాలలో అధికారులతో మరియు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులతో ఎప్పటికప్పుడు ఉన్న పరిస్థితులను తెలుసుకుంటున్నారు తగు సూచనలను అధికారికంగా ఇస్తున్నారు. గ్రామాలలో యువజన నాయకులు మరియు గ్రామ సిబ్బంది మీ గ్రామాలలో ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనించండి సహాయక చర్యలలో పాల్గొనండి భారీ వర్షాల కారణంగా పాత ఇండ్లలో నివసిస్తున్న వారు తమ తమ ఇంటి కప్పు భాగం మరియు గోడలు కానీ కూలిపోయే ప్రమాదం ఉన్నందువలన సురక్షిత ప్రాంతాల్లో ఉండండి వ్యవసాయ రైతు కూలీలు వారి పనులను వాయిదా వేసుకుని ప్రాణ రక్షణ కోసం సురక్షితంగా ఇంటిలోనే ఉండండి.

# ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం



**ముధోల్,18ఆగస్టు(తెలంగాణ సేన న్యూస్) :** మండల కేంద్రంలోని ఆయా శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం స్వాతంత్రం దినోత్స వ సందర్భంగా ఉత్తమ అవార్డులను అందజేసింది.దీంతో సోమవారం ము ధోల్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తహసిల్దార్ శ్రీలత,ఎస్సై బిట్ల పెర్సిస్, గ్రామపంచాయతీ ఈవో ఆన్వర్అ లీలకు ఘనంగా శాలువాతో సన్మా నించి మిఠాయిలను తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి వచ్చిన అనతి కాలంలోనే అవార్డులను పొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.ఉ ద్యోగంలో ప్రజలకు ఉత్తమ సేవలను అందించి మరిన్ని అవార్డులను సాధించాలని కోరారు.ఈ కార్యక్రమం లో ముధోల్ ఉత్సవ కమీటి అధ్యక్షులు రోల్ల రమేశ్,గౌరవ అధ్యక్షులు ధర్మపురి సుదర్శన్,ఉపాధ్యక్షులు తాటివార్ రమేష్,వరగంటి జీవన్, మాజీ విడిసి అధ్యక్షులు నారాయణ,కోశాధికారి సాయినాథ్,మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్ లు బోయిడి అనిల్,గడ్డం సుభాష్,మోహన్ యా దవ్,నాయకులు కోరి పోతన్న,ధర్మ పూరి శ్రీనివాస్, జంబుల సాయిప్రసా ద్,లవన్,దత్తుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అవార్డు గ్రహీతలకు సన్మానం



ముధోల్,18ఆగస్టు(తెలంగాణ సేన న్యూస్) : ఇటీవలే స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఉద్యోగ విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామపంచాయతీ ఈవో అన్వర్ అలీ, ఉపాధి హామీ కంప్యూటర్ ఆపరేటర్ కిరణ్ కు సోమవారం ఎంపీడీవో శివకుమార్, సిబ్బంది ఘనంగా శాలువాతో సన్మానించారు. సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉద్యోగం లో క్రమశిక్షణగా నిర్వహించి మంచి పనులను చేస్తే గుర్తింపు ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ అశోక్ ,కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు

# గిరియోగేష్ విద్యార్థులకు ఉత్తమ ప్రతిభ



**భైంసా:ఆగష్టు 18:తెలంగాణ సేన న్యూస్.:**రవీంద్ర భారతి హైదరాబాద్ శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మొత్తంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలు నిర్మల్ జిల్లా భైంసా మండలానికి చెందిన ఓం శ్రీ కళానిలయం డాన్స్ స్కూల్ యాజమాన్యం గిరి యోగేష్ మాస్టర్ తన విద్యార్థులకు శిక్షణ అందించి ప్రతిభను కనబరిచిన విద్యార్థు తో నృత్య ప్రదర్శనలో పాల్గొని తమ యొక్క ప్రతిభను కనబరిచారు మన భైంసా పట్టణం నుండి రవీంద్రభారతిలో నృత్య ప్రదర్శన లో పాల్గొన్నందుకు పట్టణవాసులు వీరిని మరియు వీరి ప్రతిభకు అందరి మన్ననలను పొందారు

# హైదరాబాద్ రవీంద్ర భారతి లో జరిగిన సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి వేడుకల్లో పాల్గొన్న డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్



**నర్సంపేట తెలంగాణ సేన :** హైదరాబాద్ రవీంద్ర భారతి లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనన్న సైన్యం బీసీ విధ్యార్ధి సంఘం జాతీయ అధ్యక్షులు, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ లతో కలిసి సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ విధ్యార్ధి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, గూడూరు భాస్కర్, శీరంశెట్టి రాజేందర్, బీసీ మహిళా నాకురాళ్లు కలకుంట్ల గౌతమి, స్వర్ణ గౌడ్, ఆకుల సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# జలాశయంలా మారిన జూనియర్ కళాశాల ఆవరణం


## సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న మాజీ ఉప సర్పంచ్ గడ్డం సుభాష్



**ముధోల్:ఆగష్టు 18:తెలంగాణ సేన న్యూస్. :** ముధోల్: గత రెండు మూడు రోజులుగా కురుస్తోన్న వర్షాలకు మండల కేంద్రమైన ముధోల్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం అంతా జలాశయంలా మారింది.కళాశాల ఆవరణ ప్రదేశం లోతట్టుగా ఉండడం రోడ్డు ఎత్తుగా ఉండి రోడ్డుకి ఇరువైపుల నుండి వచ్చే నీరు కళాశాలలో చేరడానికి ప్రధాన ద్వారంగా మారింది.సోమవారం ముధోల్ మండల కేంద్రానికి మాజీ ఉప సర్పంచ్ గడ్డం సుభాష్ గ్రామస్తులతో కలిసి కళాశాలకు వెళ్ళి పరిస్థితులను పరిశీలించారు.మోకాళ్ళ వరకు వర్షపు నీరు ఉంటే కళాశాలకు వచ్చే సిబ్బందికి,విద్యార్థులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విడిసి మాజీ అధ్యక్షులు నారాయణ,కోశాధికారి మైత్రి సాయినాథ్,బాబు,భోజన్న తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూములు రంగాపూర్ నిరుపేదలకు ఇవ్వాలి

## మాజీ సర్పంచ్ బిజెపి జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్





**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి ఆగష్టు 18 :** రంగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల సర్వేనెంబర్ 312లో జి ప్లస్ టూ ఎ ద్ధతిలో 372 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మరియు సర్వేనెంబర్ 212లో జి ప్లస్ టూ పద్ధతిలో 128 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రోడ్లు భవనాల శాఖ నిర్మించడం జరిగింది. ఇట్టి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను హుజురాబాద్ పట్టణంలోని పేదలకు ఇస్తున్నారని తెలిసి 25 -01-2023 రోజున జిల్లా కలెక్టర్ గారికి రంగాపూర్ లోని నిరుపేదలకు ఇచ్చిన తర్వాతనే మిగతా వారికి ఇవ్వాలని దరఖాస్తు చేయడం జరిగింది కానీ కలెక్టర్ గారు స్పందించకపోవడంతో %ఙజూ అశీ 9923/2023 ఞ్వ% 10-04-2023 రోజున గౌరవ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడం జరిగింది. ఇట్టి కేసు విచారణ జరుగుతుంది. ఈ కేసు విచారణలో ఉండగానే మళ్లీ హుజురాబాద్ మున్సిపల్ పరిధిలో ని వారికి డబుల్ బెడ్ రూములు ఇవ్వడం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిసి ఈరోజు తాసిల్దార్ హుజురాబాద్ గారికి డబుల్ బెడ్రూంలో మొత్తం రంగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో కలవని ఇట్టి ఇండ్లు ముందుగా రంగాపూర్ గ్రామంలోని పేద ప్రజలకు ఇచ్చిన తర్వాతనే ఇవ్వాలని ఇది పూర్తిగా రంగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్నందున రంగాపూర్ గ్రామపంచాయతీ హక్కులకు భంగం కలగకుండా చూడాలని తహసిల్దార్ గారిని కోరారు.

# బాల్య వివాహాలు అరికట్టడాం మనందరి బాధ్యత

## కమ్యూనిటీ సోషల్ మొబలైజర్ చిత్తారి సోమన్న



**మహబుబాబాద్ జిల్లా తెలంగాణ సేన ఆగష్టు 18 :** మహబుబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెం గ్రామంలోని పాఠశాలలో షేర్ ఎన్జీవో జస్ట్ ఫర్ చిల్డ్రన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల పై బాలా కార్మికులు పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ సోషల్ మొబలైజర్ చిత్తారి సోమన్న మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని భారత్ దేశాని బాల కార్మికులు లేని భారత్ దేశాని నిర్మిద్దాంని బాల బాలికలని పనిలో పెట్టుకున్న చట్టరీత్యా నేరమని ఎక్కడ అయినా తమ హక్కులకు గురినచో చైల్డ్ హెల్ప్ నెంబర్ 1098 100 ఫోన్ చేయాలని మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యారాలు మాధవి లత మాట్లాడుతూ పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ విషయాల గురించి వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**తెలంగాణ సేన :** సర్దార్ సర్వాయు పాపన్న గౌడ్ గొప్ప పోరాటయోధుడని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, గాడి పల్లి భాస్కర్, మాజీ కౌన్సిలర్ బబ్బురి రజిత గౌడ్ అన్నారు,సోమవారం గజ్వేల్ చౌరస్తా లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి ఉత్సవాలు గౌడ సంఘం అధ్యక్షుడు రాజా గౌడ్, గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్బండ వర్గాలకు రాజకీయ సామాజిక సమానత్వం కోసం ఈయన చేసిన కృషి చరిత్రలో నిలిచింది. తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ఒక ప్రతీక. నాటి కాలంలో అన్ని వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వాములను కావాలని ప్రజాస్వామ్యక స్పూర్తితో చేసిన పోరాటం గొప్ప విషయం. విశ్వ కీర్తి పొందిన ఆయన గొప్పదనాన్ని స్మరించుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ జేజేల వెంకటేశం, గౌడ సంఘం అధ్యక్షుడు రాజాగౌడ్, పంజలా గణేష్ గౌడ్, రాజా మల్లా గౌడ్, జె.బలరాం గౌడ్, జె.శ్రీనివాస్ గౌడ్, అశోక్ గౌడ్,జె.శ్రీనివాస్ గౌడ్, నక్క.రేగొండ గౌడ్, రాములు గౌడ్, నర్సింలు గౌడ్, తిరుపతి గౌడ్ , ఏ. సుధాకర్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, మల్లేశం గౌడ్,కే.అర్జున్ గౌడ్, తాళ్ల నాగరాజు గౌడ్, రాములు గౌడ్,గుర్రం దేవేందర్ గౌడ్,ఏం శ్రీనివాస్ గౌడ్,బి.స్వామి గౌడ్, అప్కారి శ్రీధర్ గౌడ్, నర్సా గౌడ్, రాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు

# ఏడు బావులు జలపాతం ప్రమాదకరంగా ఉంది




**గంగారం తెలంగాణ సేన :** బావులు జలపాతం ప్రమాదకరంగా ఉంది.జలపాతం వద్ద లోతైన బావి ఉంది, ఈ జలపాతం వద్ద ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం జరుగుతునందున జలపాతం సందర్శనకు ఎటువంటి అనుమతులు లేవు అని గంగారం ఎస్ఐ, గంగారం అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఏడు బావుల జలపాతం వద్ద భారీ బందోబస్తు నిర్వహిస్తు, పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు...

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

## కొత్తగూడ గంగారం మండల అధ్యక్షులు వజ్జ సారయ్య జాడి వెంకటేశ్వర్లు





**కొత్తగూడ తెలంగాణ సేన :** వాతావరణ కేంద్రం సూచనా ప్రకారం రానున్న 3,4 రోజుల్లో రైతులు,జాలర్లు,ప్రజలు పశువుల కాపర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కాంగ్రెస్ పార్టీ నాయకులు. కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి అండగా ఉండాలని కోరారు. మంత్రి సీతక్క ఏప్పటికప్పుడు జిల్లా అధికారులతో, పార్టీ నాయకులతో సమాచార సేకరణ తగు సూచనలు సలహాలు అందరిని అప్రమత్తం చేస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో రెండు మండలాల ప్రజలు స్వీయ రక్షణ పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని , గ్రామాల్లో ముంపు ప్రాంతాల్లో ఉండే ప్రజలు వెంటనే దగ్గరలోని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని మండల పార్టీ అధ్యక్షులు వజ్జ సారయ్య జాడి వెంకటేశ్వర్లు అన్నారు. ములుగు జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రానున్న రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రధానంగా వర్షం సమయంలో చెట్ల కింద, పాడైన భవనాలు కింద, శిధిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండరాదన్నారు. అత్యవసరమైతేనే బయటికి వెళ్లాలన్నారు.

# ఆది తనయుడి అద్భుత వినూత్న ఆలోచన.....

## - గౌరవం నుంచి సేవ దిశగా ఆది కార్తీక్



**వేములవాడ,ఆగష్టు 18 (తెలంగాణ సేన)** :వేములవాడ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కుమారుడు ఆది కార్తీక్ ఒక ప్రత్యేకమైన సామాజిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యేకు అభిమానులు, నాయకులు గౌరవంగా శాలువతో సత్కరించిన వాటిని సాధారణంగా అల్మారాలో దాచిపెట్టబడతాయి.కానీ ఆది కార్తీక్ వాటికి కొత్త జీవం పోసే వినూత్న ఆలోచనతో ముందుకు వచ్చారు.”ఫ్రమ్ హానర్ టూ హ్యూమానిటీ” పేరుతో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో, శాలువలను ఉపయోగించి చిన్నారుల కోసం పండుగ దుస్తులుగా మార్చుతున్నారు.నైపుణ్యం కలిగిన టైలర్లు,డిజైనర్లు కలిసి శాలువలను ఆకర్షణీయమైన పిల్లల దుస్తులుగా మార్చుతున్నారు.రాబోయే బతుకమ్మ పండుగ సందర్భంగా 500 నుండి 1000 దుస్తులు పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ఉచితంగా పంపిణీ చేయనున్నారు.ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వయంగా పిల్లలకు ఈ దుస్తులను అందజేసి, వారి ఆనందంలో భాగస్వాములు కానున్నారు.”గౌరవాన్ని సేవగా మార్చడం మా లక్ష్యం” అని ఆది కార్తీక్ తెలిపారు.ఈ కార్యక్రమం యువతకు సామాజిక బాధ్యత, సేవా తత్వానికి ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తోంది.

# నేతాజీ వర్ధంతి సందర్భంగా బీజేపీ నేతల ఘన నివాళులు....



**వేములవాడ,ఆగష్టు 18 (తెలంగాణ సేన)** : వేములవాడ పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ “సుభాష్ చంద్రబోస్ అహింసా మార్గమే కాదు, సాయుధ పోరాటంతో కూడా బ్రిటిష్ శాసకులను గడగడలాడించిన మహనీయుడు అన్నారు. దేశ స్వాతంత్ర్యంలో ఆయన పాత్ర మరవలేనిది. యువత ఆయన ఆదర్శాలను చూసి దేశసేవ పట్ల నిబద్ధతతో ముందుకు సాగాలి” అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ కోలా కృష్ణసామి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు సంటి మహేష్, అందం నరసయ్య, బోనాల శివ, మల్లేశం, రేగుల శ్రీకాంత్, రేగుల రాజకుమార్, దేవరాజు శివ తదితర నాయకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ యువజన సంఘం నూతన అధ్యక్షుడిగా వంగూరి సందీప్ ఎన్నిక



**సూర్యాపేట జిల్లా,తెలంగాణ సేన:** నాగారం: నాగారం మండల పరిధిలోని ఈటూరు గ్రామ పంచాయతీలో అంబేద్కర్ యువజన సంఘం సమావేశం సోమవారం నాడు జరిగింది. సంఘం నూతన అధ్యక్షుడిగా వంగూరి సందీప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఆయనతో పాటు గౌరవ అధ్యక్షులుగా రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ పేరాల సోమయ్య గారు. ఉపాధ్యక్షులుగా పోలేపాక అంజి, ప్రధాన కార్యదర్శిగా పేరాల వెంకటేష్,కోశాధికారిగా వంగూరి శశి కుమార్,సాంస్కృతిక కార్యదర్శిగా పేరాల గౌతమ్,క్రిడలా కార్యదర్శిగా బోడ లోకేష్, కార్యవర్గ సభ్యుడిగా వంగూరి శివ లు మొత్తం 8 మందితో నూతన కమిటీ ఎన్నికోవటం జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు గా ఎన్నికైన వంగూరి సందీప్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ పోరాట స్పూర్తితో 30 యేండ్ల క్రితం ఈటూరు గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఏర్పాటు చేశామని అలాంటి సంఘానికి అధ్యక్షులు గా ఎన్నికైనందుకు గర్వాంగా ఉందని అన్నారు. భారత రాజ్యాంగా స్ఫూర్తితో అంబేద్కర్ గారి పోరాట స్పూర్తితో అంబేద్కర్ యువజనం సంఘం ఆధ్వర్యంలో లో గ్రామాల్లో అంటరాని తనానికి కుల, మత వివక్షలకి వ్యతిరేకంగా దోపిడీ లేని సమాజాన్ని నిర్మించటం కోసం జరిగే పోరాటల్లో మరియు ఆత్మ గౌరవ పోరాటల్లో భాగం భాగం అయితామని తెలియజేశారు. గ్రామాల్లో మూఢ నమ్మకాలకి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావటానికి కృషి చేస్తామని అన్నారు.తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సీనియర్ సభ్యులు పేరాల కృష్ణ కుమార్, పేరాల వెంకటేష్, నాగిళ్ల కాశిమ్, వంగూరి అనిల్, ఎల్లి సైదులు, బోడ నరేష్, ఎల్లి అనిల్, యల బిక్షం, బోడ రాకేష్, మహంకాళి గణేష్, పేరాల గోపి మరియు తదితరులు పాల్గొన్నారు.

# పనుల బాధ్యత మీది.. నిధుల బాధ్యత నాది..

**ఎన్ని పనులైనా ప్రతిపాదించండి..వాటికి నిధులు నేను తీసుకొస్తా**

**చెరువు కట్టల పటిష్టతపై తక్షణం సర్వే చేయండి**

**పంటల నష్టం పై సమగ్ర సమాచారం ఇవ్వండి**

**ఒక్క విద్యుత్ ప్రమాదం కూడా జరగకుండా చూడండి**

**జడ్చర్ల పట్టణ రోడ్లపై వర్షపు నీళ్లు నిలువకుండా చేయండి**

**మరో ఇరవై ఏళ్లపాటు ఇబ్బంది లేకుండా ప్రణాళికలు వేయండి**

**అధికారులకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆదేశించండి**



**జడ్చర్ల, ఆగష్టు 18 తెలంగాణసేన :** : మరో వారం పదిరోజుల పాటు నియోజకవర్గ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్న నేపథ్యంలో నీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, చెరువుల కట్టలు బలహీనపడి తెగిపోయే ప్రమాదం ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే తన దృష్టికి తీసుకురావాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి కోరారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. జడ్చర్ల పట్టణంలో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోకుండా మరో 20 ఏళ్ల వరకూ సరిపోయే ప్రణాళికలు రూపొందించాలని మున్సిపల్ అధికారులను కోరారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను తనకు తక్షణం తెలియజేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

జడ్చర్ల నియోజకవర్గ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ, రెవెన్యూ, మున్సిపల్, ప్రజారోగ్య శాఖల అధికారులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగానే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం కురిసిన వర్షాల కారణంగా నియోజకవర్గంలోని అన్ని చెరువులు నిండి అలుగులు పారుతున్నాయని, అయితే ఈ వర్షాలు మరి కొన్ని రోజులు కొనసాగితే బలహీనమైన చెరువు కట్టలు తెగిపోయి నఈళ్లంతా వృధాగా వెళ్లిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసారు. అందుకే ఇరిగేషన్ శాఖ అధికారులు వెంటనే అన్ని చెరువు కట్టల పటిష్టతను సర్వే చేసి ఎక్కడైనా చెరువు కట్టలు తెగిపోయే ప్రమాదం ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న అధికారులందరూ ఒక వాట్సాప్ గ్రూప్ ను ఏర్పాటు చేసి అందులో తనను కూడా చేర్చాలని, భారీ వర్షాల నేపథ్యంలో వారికి ఏ సమస్యలు ఉన్నా ఈ గ్రూపు ద్వారా తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించడానికి తాను వెంటనే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జడ్చర్ల పట్టణ పరిధిలో ఉన్న నల్లచెరువు, నల్లకుంట, ఊరచెరువు తదితర చెరువులకు నీళ్లు ప్రవహించే ఛానల్స్ ను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీడర్ ఛానల్స్ ఆక్రమణలకు గురైన చోట వాటిని వెడల్పు చేయడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని, చెరువుల్లోకి నీళ్లు సాఫీగా వెళ్లిపోయేలా చూడాలన్నారు. జడ్చర్ల పట్టణంలో రహదారులపై నీల్లు నిల్వకుండా ఉండటానికి 20 ఏళ్లకు సరిపోయేలా పనులను ప్రతిపాదించాలని సూచించారు. పనులను మీరు ప్రతిపాదిస్తే అవసరమైన నిధులను తాను తీసుకొస్తానని ఆయన అధికారులకు హామీ ఇచ్చారు. చెరువుల ఎఫ్టీఎల్ బఫర్ జోన్ల పరిధిలో ఎక్కడైనా ఎవరైనా ప్లాటింగ్ చేస్తే నిర్మొహమాటంగా వాటిని తొలగించాలని ఆదేశించారు. పట్టణాల పరిధిలోనే ఇలాంటివి జరుగుతున్నాయని అధికారులు చెప్పగా ఎక్కడైనా సరే అలాంటి ఆక్రమణలను తొలగించాల్సిందేనని, ఎవరు చేసినా అలాంటి పనులకు తాను ఎన్నడూ మద్దతు ఇవ్వనని స్పష్టం చేసారు. కాగా నియోజకవర్గంలో విద్యుత్ ప్రమాదాల కారణంగా ఎవరూ బలి కాకుండా చూడాలని, ఒక్క విద్యుత్ ప్రమాదం కూడా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడటం కోసం రూ.11 కోట్లతో సేఫ్టీ బడ్జెట్ ను ప్రభుత్వానికి పంపామని, ఆ నిధులు త్వరగా వచ్చేలా చూడాలని అధికారులు కోరగా, ఈ విషయం గురించి తక్షణ చర్యలు తీసుకోవాలని అనిరుధ్ రెడ్డి విద్యుత్ శాఖ సీఎండీని ఫోన్ లో కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే నియోజకవర్గంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని వ్యవసాయ అధికారులను అనిరుధ్ ఆదేశించారు.

# లాబ్ది గ్రామంలో వరద నీరు పట్టించుకనే.. వారెవరు...!

**కొన్ని సంవత్సరాల నుండి ఇదే పరిస్థితి**

**అధికారులు వస్తున్నారు అప్రమత్తంగా ఉండాలని వెళ్తున్నారు**

**మా గ్రామం తెలంగాణ ప్రాంతంలో లేదా..?**

**గ్రామస్తుల ఆవేదన...!**









**బాసర:ఆగష్టు 18:తెలంగాణ సేన** న్యూస్.: నిర్మల్ జిల్లా బాసర మండల పరిధిలోని లాబ్ది గ్రామం ఇప్పటికే వరదనీరుతో గ్రామంలోకి చేరబడి గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గత నాలుగు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురవడంతో గ్రామం ప్రక్కనే ఉన్న వాగు ఉధృతంగా పారడంతో వరద నీరు పొరలి పొంగి ఏకంగా హనుమాన్ ఆలయంతో పాటు ఎస్సీ కాలనీలలో కాకుండా గ్రామంలో వరద నీరు చేరడంతో ఏకంగా గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

**మా గ్రామం తెలంగాణ ప్రాంతంలో లేదా..?**

వాస్తవానికి లాబ్ది గ్రామం గత కొన్ని సంవత్సరాల నుండి తెలంగాణ ప్రాంతంలో ఉన్న అభివృద్ధిలో మాత్రం సున్నా, లబ్ది గ్రామం నుండి మహారాష్ట్రకు వెళ్లాలంటే 15 కిలోమీటర్ల దూరం ఉండడంతో ఇక్కడ మరాఠీ భాష మాట్లాడడం తోపాటు ఈ గ్రామమంతా మహారాష్ట్ర సాంప్రదాయంగా ఉంటుంది. దీనితో ఎలాంటి అధికారులు వచ్చిన తెలుగు భాషలో అనర్గళంగా మాట్లాడాలంటే కొంత ఇబ్బందిగా మారుతుంది ఇలాంటి అధికారులు వచ్చిన సభలు పెట్టిన కొన్ని వ్యాధుల రైతుల పట్ల సదస్సులు నిర్వహించిన హిందీ భాషలో మాట్లాడుతారు తెలుగు వచ్చి వారు 100% నుండి 25% మాత్రమే ఉంటారు దీనితో మా గ్రామం మహారాష్ట్ర ఉందా లేదా తెలంగాణలో ఉందా అని గ్రామస్తులు అగ్రహం వ్యక్తం చేస్తూ తమ తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా గ్రామంలో తెలుగు పాఠశాల కూడా ఉంది కానీ అధికారులు వర్షాకాలం వస్తే మాత్రమే గ్రామానికి వచ్చి సందర్శిస్తారు మిగతా సమయంలో ఎవరు రారని ఆందోళన చెందుతున్నారు. గత కొన్ని సంవత్సరాల నుండి అదే వాగు లబ్ది దూడపుర్ గ్రామం వాగుకు అంచున ఉన్నందున వర్షాకాలంలో భారీ వర్షాలు ఎగువ బాగున్న వర్షాలు కురిస్తే ఉధృతంగా వాగు ప్రవహిస్తుంది. గత కొన్ని సంవత్సరాలు కాలంలో వాగు నిర్మించినప్పటికీ ఎత్తు భాగంలో లేని ఎడల వర్షపు నీరు నేరుగా గ్రామంలో ప్రవహిస్తుంది. దీనితో వాగు దిగేంతవరకు గ్రామంలో ఉన్న వరదనీరుతో అనేక వ్యాధులతో ప్రజలు గ్రామస్తులు మలేరియా టైఫాయిడ్ డెంగ్యూ లాంటి జ్వరంతో ఉంటారు కనీసం గ్రామంలో వర్షకాలంలో వరద నీరు వచ్చిందంటే మెడికల్ క్యాంపు కూడా పెట్టారు అని గ్రామస్తులు ఎద్దేవా చేశారు. దొడపూర్ నుండి లాబ్ది మార్గమున మహారాష్ట్ర తెలంగాణ బాసర మండలానికి వెళ్లాలంటే అడ్డంగా వాగు ఉండడంతో వర్షాకాలంలో దాదాపు నెల రోజులపాటు లాబ్ది గ్రామం తో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు వాగు దాటి ప్రయత్నం లేక అక్కడే ఉండి సమయం వెల్లదిస్తున్నారు. లాబ్ది గ్రామంలోని కొన్ని ఇంట్లో వరద నీరు చొరబడి కొందరు కూనుకు లేక గ్రామం దాటాలంటే భయం భయంగా మారి గ్రామంలో వరదనీరుతో ఇప్పటికే విషపూరిత పాములతో పాటు పురుగులు అనేక చట్ట చదరం వచ్చి ఇంటి వద్దని నిల్వ ఉండడంతో దోమల బెడద సమస్యగా మారుతుంది. ఇది కొన్ని సంవత్సరాల నుండి వస్తున్న కనీసం కనికరించని ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు కూడా మా గ్రామం వైపు చూడలేకపోతున్నారు ఎందుకు మా గ్రామం పై ఇంత చిన్నచూపు అంటూ గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం ప్రజాప్రతినిధులు స్పందించి లాబ్బి దూడపుర్ మార్గమధ్యన ఉన్న మా గ్రామ అంచున వాగుపై పెద్ద వంతెన కడితే సమస్య తీరుతుందని మాపై దయ కరుణ ఉంచి వంతెన నిర్మాణం నికి పూనుకోవాలని గ్రామస్తులు మొర పెడుతున్నారు. ఇప్పటికే మండల అధికారులతో పాటు జిల్లా అధికారులతో అనేక ప్రజాప్రతినిధులతో మా గ్రామ సమస్యలు వెల్లడించిన కానీ ఎవరు పట్టించుకుని నాథుడే లేకపోవడంతో మా గ్రామ పరిస్థితి ఇలా నెలకొందని అదేవిధంగా గ్రామంలో అంతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతో పాటు దుర్గంధపు వాసన వెదజల్లడంతో గ్రామస్తులు అస్తవ్యస్తంగా మారడంతో ఆగ్రహానికి లోనైతున్నారు.


# సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

## అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో



**తెలంగాణ సేన :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, 375వ జయంతి వేడుకలు లో అధికారికంగా సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో , అదనపు కలెక్టర్ రెవెన్యు కె.అనిల్ కుమార్ తో హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం మాట్లాడుతూ..సర్దార్ సర్వాయి పాపన్న గొప్ప పోరాట యోధుడని సామాన్య కుటుంబంలో పుట్టి, అతి గొప్ప స్థాయికి ఎదిగిన మహోన్నత వ్యక్తి అని ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదు శక్తి అని నిరూపించారని అన్నారు. నిజాం పాలన పై తిరుగుబాటు చేసి వారి ఆగడాల కు అడ్డుకట్ట వేసేందుకు యుద్ధం చేసి గుణపాఠం చెప్పారన్నారు. ఆయన మన ప్రాంతంలో పుట్టడం మన అదృష్టం అన్నారు. ఆయన పోరాటం భావి తరాలకు స్ఫూర్తి గా నిలుస్తుందన్నారు. అందుకే సర్వాయి పాపన్న జయంతి, వర్ధంతి లను ప్రభుత్వమే నిర్వహిస్తున్నదన్నారు. గౌడ కులస్తులు వృత్తిని ప్రేమిస్తూ...పిల్లలను బాగా చదివించుకోవాలని, మీరు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సమాజంలో అన్ని వర్గాల ప్రజలు బాగుపడితేనే రాష్ట్రం దేశం బాగుపడుతుందని గౌడలకు అభినందనలు! శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి.సి.సంక్షేమ అధికారి నరసింహాస్వామి, స్థానిక ప్రజాప్రతినిధులు గౌడ సంఘాల ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్....



**వేములవాడ,ఆగష్టు 18 (తెలంగాణ సేన)** : వేములవాడ, పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బహుజనుల ఆకాంక్షలకు ప్రతీకగా అందరినీ కలుపుకొని సామాజిక న్యాయం కోసం ఉద్యమించిన మహానాయకుడని, వారి చరిత్ర భవిష్యత్ తరాలకూ ఆదర్శంగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ హైదరాబాదులో పాపన్న గారి విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేశానికి మార్గదర్శకంగా నిలిచే విధంగా రాష్ట్రంలో కుల గణన చేపట్టినట్టు తెలిపారు.సర్దార్ పాపన్న ఒంటరిగా కాదు, బహుజనులంతా కలసి రాజ్యాధికార దిశగా పోరాటం చేసిన చరిత్రను గుర్తు చేస్తూ, నేడు కూడా రాజ్యాంగానికి లోబడి రిజర్వేషన్ల సాధనకు అందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# పదిహేనో రోజుకు చేరిన టాలీవుడ్ సమ్మె



టాలీవుడ్ లో సినీ కార్మికులకు నిర్మాతలకు మధ్య జరుగుతున్న పంచాయితీ ఎడతెగడం లేదు. వేతనాల పెంపు, పెంచిన వేతనాలను సకాలంలో చెల్లించాలనే డిమాండ్లతో టాలీవుడ్ లో సినీ కార్మికుల సమ్మె 15వ రోజుకు చేరుకుంది. కార్మిక సంఘాలు, నిర్మాతల మండలికి మధ్య జరిగిన చర్చలు సఫలం కాకపోవడంతో పదిహేను రోజుల నుంచి షూటింగ్స్ నిలిచిపోయాయి. కార్మిక సంఘాలు పెట్టిన అన్ని డిమాండ్లను అంగీకరించే పరిస్థితుల్లో లేమని నిర్మాతలు చెబుతుండగా, తమకు బకాయిపడిన పదమూడు కోట్ల రూపాయల వేతనాలు చెల్లించాలని కార్మికసంఘాలు పట్టుబడుతున్నాయి. ఈ విషయంపై ఈరోజు కార్మిక సంఘాల నేతలు మెగాస్టార్ చిరంజీవిని కలవనున్నారు. అంతుకు ముందు ఫెడరేషన్ కార్యాలయంలో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు.

**పెద్దన్నగా చిరంజీవి..**

మెగాస్టార్ చిరంజీవి తెలుగు చిత్ర పరిశ్రమకు పెద్దన్నగా మారారు. దర్శకుడు దాసరి నారాయణరావు ఉన్నంత వరకు ఆయనే అందరికీ పెద్దగా వ్యవహరించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపేవారు. దాసరి మరణానంతరం సినీ పరిశ్రమలోని వారంతా చిరంజీవి వైపు చూస్తున్నారు. ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో తలెత్తుతున్న అనేక సమస్యలకు చిరంజీవి పరిష్కారం కనుగొనే ప్రయత్నం చేస్తున్నారు. సినిమాల నిర్మాతల తరుపున ముఖ్యమంత్రిని కలిసే బృందంలోనూ ఆయననే ముందు పెట్టి వెళుతున్నారంటే ఆయనకు పరిశ్రమ ఇస్తున్న గౌరవం అదే అనుకోవాలి. ఈ నేపథ్యంలో చిరంజీవి ఇంటి వద్దకు సమ్మె పంచాయతీ చేరింది. ఈరోజు ఇటు నిర్మాతలతోనూ, అటు కార్మిక సంఘాల ప్రతినిధులతోనూ చిరంజీవి విడివిగా సమావేశమవుతున్నారు. చిత్ర పరిశ్రమ ప్రతిష్టను పెంచడంతో పాటు జరిగే నష్టాన్ని నివారించడానికి చిరు నడుంకట్టారనే అనుకోవాలి.

**కారణాలు.. డిమాండ్లు**

తెలుగు సినీ పరిశ్రమలో సుమారు 24 క్రాఫ్ట్‌లలో 15,000 మందికి పైగా రిజిస్టరైన కార్మికులు ఉన్నారు. సాధారణ కార్మికుల నుంచి లైట్ బాయ్స్, డ్రైవర్లు, మేకప్ ఆర్టిస్టులు, టెక్నీషియన్లు, ఫైటర్స్, డ్యాన్సర్స్ వరకు అనేక మంది ఈ పరిశ్రమలో భాగం. ఈ కార్మికులందరూ సినీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తూ, తమ కుటుంబాలను పోషిస్తున్నారు. అయితే, గత కొన్ని సంవత్సరాలుగా సినిమా బడ్జెట్లు, హీరోల రెమ్యునరేషన్లు ఆకాశాన్ని అంటుతున్నాయి. అయినప్పటికీ, కార్మికుల వేతనాలు మాత్రం పెద్దగా పెరగలేదు. ప్రస్తుత జీవన వ్యయానికి, వారికి అందుతున్న వేతనాలకు మధ్య భారీ అంతరం ఏర్పడింది. ఈ వ్యత్యాసమే సమ్మెకు ప్రధాన కారణం. సకాలంలో వేతనాల చెల్లింపు. చాలా సందర్భాల్లో, వేతనాలు చెల్లించడంలో నిర్మాతల నుంచి తీవ్ర జాప్యం జరుగుతోందని కార్మికులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల తమకు ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయని, తమ కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందని వాపోతున్నారు. పని ప్రదేశంలో భద్రత. ప్రమాదాలు జరిగినప్పుడు సరైన పరిహారం, వైద్య సదుపాయాలు అందడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు, కార్మికుల సంక్షేమం కోసం బీమా, ఆరోగ్య భద్రత వంటి సౌకర్యాలు కల్పించాలని కూడా వారు డిమాండ్ చేస్తున్నారు.

**వేల కోట్ల పరిశ్రమ- స్వల్ప వేతనాలు..**

ప్రస్తుతం, తెలుగు సినీ పరిశ్రమ ఒక భారీ వ్యాపార సామ్రాజ్యంగా మారింది. వార్షిక టర్నోవర్ రూ 3,000 కోట్ల నుంచి రూ 4,000 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఈ భారీ ఆదాయంలో సింహభాగం కేవలం కొద్దిమంది స్టార్లకే వెళ్తోంది. స్టార్ హీరోల రెమ్యునరేషన్లు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్, అల్లు అర్జున్ వంటి అగ్ర హీరోలు సినిమాకు రూ 80 కోట్ల నుంచి రూ 150 కోట్లు తీసుకుంటున్నారని నివేదికలు చెబుతున్నాయి. హీరోయిన్లు కూడా ఒక్కో సినిమాకు రూ 5 కోట్ల నుంచి రూ 10 కోట్ల వరకు పారితోషికాలు అందుకుంటున్నారు. అయితే, ఒక సాధారణ కార్మికుడికి రోజువారీ వేతనం రూ 1000 నుంచి రూ 1500 వరకు మాత్రమే ఉంటుంది. టెక్నీషియన్లకు రూ 2000 నుంచి రూ 3000 వరకు వేతనాలు ఉంటాయి. ఈ వేతనాలు హైదరాబాద్ వంటి నగరంలో కుటుంబం గడపడానికి ఏ మాత్రం సరిపోవు. పెట్రోల్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న ఈ రోజుల్లో, ఈ తక్కువ వేతనాలతో వారు జీవించడం అసాధ్యంగా మారింది. వేతనాల పెంపు 30% నుంచి 45% వరకు పెంచి, దాంతోపాటు సకాలంలో వేతనాల చెల్లింపు చేయాలని కార్మికులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. ఒక సినిమా బడ్జెట్‌లో ఎక్కువ భాగం హీరో, హీరోయిన్ల, దర్శకుల రెమ్యునరేషన్‌లకే కేటాయిస్తున్నప్పుడు, కార్మికుల వేతనాలను పెంచడానికి నిరాకరించడం ఎంతవరకు సమంజసమని కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

# మరో పది నెలల్లో భోగాపురం విమానాశ్రయం పూర్తి!

## సిద్ధమవుతున్న రన్‌వే





విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్? ఎయిర్?పోర్టు నిర్మాణ పనులు వాయువేగంతో జరుగుతున్నాయి. 2026 జూన్‌కల్లా అంటే మరో పది నెలల్లో పూర్తయ్యేలా పనుల్లో వేగం పెంచాలని నిర్మాణ సంస్థ జీఎంఆర్‌ను సీఎం చంద్రబాబు కోరారు. దీంతో గడువుకు ముందే విమానాశ్రయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు సంస్థ పనుల్లో వేగం పెంచింది. ఈ ప్రాజెక్టును ఎల్‌అండ్‌టీ ద్వారా జీఎంఆర్ చేపట్టిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికి 31.80% మాత్రమే పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది జులై నెలాఖరుకు 84% పనుల్ని పూర్తి కావడం విశేషం.విశాఖ పోర్టు నుంచి భోగాపురం చేరుకునేలా: భోగాపురం విమానాశ్రయానికి విశాఖపట్నం నుంచి ప్రయాణికులు 45 నిమిషాల్లో చేరుకునేందుకు వీలుగా సంకల్పించిన బీచ్ కారిడార్ నిర్మాణ ప్రతిపాదన గత ప్రభుత్వ హయాంలో ముందుకు సాగలేదు. ప్రస్తుతం రూ.2,800 కోట్ల వ్యయంతో భూ సేకరణ, రహదారి విస్తరణ పనులకు సంబంధించిన డీపీఆర్ సైతం సిద్ధమైంది. విశాఖ పోర్టు నుంచి భీమిలి మీదుగా మూలకొద్ది వద్ద గోస్తనీ నదిపై బ్రిడ్జిపై నిర్మించి భోగాపురం చేరుకునేలా బీచ్ కారిడార్‌కు అడుగులు పడుతున్నాయి.మరో 10 నెలల్లో భోగాపురం విమానాశ్రయం పూర్తి కానుంది. దీనికి అనుగుణంగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని చేపట్టి, పూర్తి చేయాలని భావిస్తున్నారు. విమానాశ్రయానికి అనుబంధంగా గుర్తించిన 15 అంతర్గత రోడ్లు విస్తరించి కనెక్టివిటీ పెంచాలని విశాఖ మహా నగరపాలక సంస్థ నిర్ణయించింది. వీటిని 4 వరుసల రహదారులుగా మారిస్తే భోగాపురం చేరుకోవడం సులువవుతుంది. విజయనగరం రింగ్‌రోడ్డు-అయినాడ జంక్షన్, దొరతోట, కాపులుప్పాడ, మద్దిలపాలెం, శొంఠ్యాం-అడవివరం, బోయపాలెం, షీలానగర్ వద్ద రోడ్డు విస్తరణ పనులు కీలకం కానున్నాయి. వీటి విస్తరణకు రూ.390 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. 15 అంతర్గత రోడ్లలో అత్యంత ప్రాధాన్యంగా గుర్తించిన 7 రహదారుల నిర్మాణం 2026 జూన్‌కి పూర్తి చేయాలని భావిస్తోంది. దీనికోసం 174.64 కోట్ల రూపాయలతో టెండర్లు ఆహ్వానించింది. సిద్ధమవుతున్న రన్‌వే: విశాఖపట్నం శివారు అగనంపూడి నుంచి కొమ్మాది వరకు 12 జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంది. దీన్ని అధిగమించడానికి అగనంపూడి-లంకెలపాలెం, విశాఖ స్టీల్ ప్లాంటు-, సత్యం జంక్షన్- హనుమంతువాక, మధురవాడ స్టేడియం-కొమ్మాది వరకు 4 ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు కూడా గడువుకు ముందే పూర్తవుతుందని విజయనగరం జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పనులకు సంబంధించి సీఎస్ విజయానంద్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు వెల్లడించారు.2 దశల్లో విమానాశ్రయం నిర్మాణం: రెండు దశల్లో భోగాపురం విమానాశ్రయం నిర్మాణాన్ని పూర్తి చేయనున్నారు. రూ.4,592 కోట్ల వ్యయంతో తొలు దశలో 22 ఏరో బ్రిడ్జ్‌లు, 81,000 చదరపు మీటర్ల టెర్మినల్ బిల్డింగ్ నిర్మించనున్నారు. 2,203 ఎకరాల్లో విమానాశ్రయం విస్తీర్ణం పూర్తి చేయనున్నారు. ఇతర అవసరాలకు తాజాగా మరో 500 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఒక్కోటీ 3.8 కి.మీ. పొడవుతో రెండు రన్‌వేలు నిర్మిస్తున్నారు. ఏటా ప్రయాణికులు ఆరంభంలో 60 లక్షలమంది ఉండగా, అంచెలంచెలుగా ఈ సంఖ్య నాలుగు కోట్లకు చేరుకుంటుందని భావిస్తున్నారు. 2030 ప్రారంభంలో రెండోదశ నిర్మాణ పనులు మొదలు కానున్నాయి.

# తెరుచుకున్న అయ్యప్ప ఆలయం



కేరళలోని శబరిమల అయ్యప్పస్వామి ఆలయం తలుపులు తెరుచుకున్నాయి. వార్షిక చింగం మాస పూజల నేపథ్యంలో శనివారం సాయంత్రం ఐదు గంటలకు పూజారులు తలుపులు తెరిచారు. ప్రధాన పూజారి అరుణ్ కుమార్ నంబూద్రి తంత్రి కందరరు మహేష్ మోహనరు సమక్షంలో ఆలయ దీపాలను, ఆళి (పవిత్ర అగ్నిగుండం)ను వెలిగించారు. వేలాది మంది అయ్యప్ప భక్తులు భారీ వర్షాన్ని లెక్కచేయకుండా వేడుకను తిలకించారు.

**సెప్టెంబర్ 20న సమావేశం**

చింగం మాస పూజలను పూర్తి అయ్యే వరకు పడిపూజ కార్యక్రమం ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు జరుగుతుంది. అదే సమయంలో సెప్టెంబర్ 20న పంబా నది ఒడ్డున గ్లోబల్ అయ్యప్ప సమావేశం జరుగుతుందని దేవాదాయ శాఖ మంత్రి వీఎన్ వాసవన్ ప్రకటించారు. ఇంత పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించడం ఇదే మొదటిసారి కాబట్టి, ఒక చారిత్రాత్మక కార్యక్రమంగా నిలవనుందని తెలిపారు. వివిధ దేశాల నుంచి 3,000 మంది ప్రతినిధులు హాజరవుతారని భావిస్తున్నట్లు తెలిపారు.

**మాస్టర్ ప్లాన్ రెడీ**

శబరిమల ప్రపంచ ఖ్యాతిని పెంచే లక్ష్యంతో జరిగే ఆ సమావేశంలో కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొంటారు. శబరిమల సంప్రదాయాలను కాపాడుతూ, భక్తుల ప్రయోజనాలను గౌరవిస్తూ, శబరిమలని ప్రపంచ తీర్థయాత్ర కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి వాసవన్ పేర్కొన్నారు. ప్రభుత్వం రూ.1,300 కోట్ల విలువైన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించిందని తెలిపారు. అందులో శబరిమల విమానాశ్రయం, కొత్త రైల్వే లైన్ సహా వివిధ ప్రణాళికలు ఉన్నాయి. విమానాశ్రయం 2028 నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

**రవాణా, వసతి ఏర్పాట్లు**

అదే సమయంలో జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో పథనం తిట్టలో ప్రధాన నిర్వాహక కమిటీ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. పంబా, పెరునాడ్, సీతాథోడ్‌లలో అదనపు కార్యాలయాలు ఉంటాయి. ప్రతినిధులకు బస్సుల ద్వారా రవాణా, వసతి ఏర్పాట్లు చేయనున్నారు. పంబాతో సహా ఆ ప్రాంతంలోని ఆసుపత్రులలో ఆధునిక వైద్య సౌకర్యాలు కల్పించనున్నారు. వాహనాల పార్కింగ్ కొండపై ఉండనుంది. స్వచ్ఛంద సంస్థలు పారిశుధ్యం, శుభ్రపరిచే విషయంలో సహాయం చేస్తాయి.

# హైదరాబాద్ ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్త

**టీఏవైఎల్ టిక్కెట్‌పై రూ. 10 నుంచి రూ. 20 వరకు తగ్గింపు**

**ఈ నెల 15 నుంచి 31 వరకు అందుబాటులో తగ్గింపు ధరలు**

**మెట్రో డీలక్స్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో**

**24 గంటల పాటు అందుబాటులో టిక్కెట్లు**

భాగ్యనగర ప్రజలకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్తను అందించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'ఫ్రీడమ్ ఆఫర్' కింద ట్రావెల్ యాజ్ యు లైక్ (టీఏవైఎల్) టిక్కెట్ ధరను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. పరిమిత కాలం వరకు మాత్రమే ఈ తగ్గింపు ధర అందుబాటులో ఉంటుంది. ఈ నెల 15 నుంచి 31వ తేదీ వరకు తగ్గింపు ధరలు అందుబాటులో ఉంటాయని సంబంధిత అధికారులు తెలిపారు.మెట్రో డీలక్స్ బస్సులతో పాటు సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 24 గంటల పాటు ఈ టిక్కెట్లను కొనుగోలు చేసే సౌకర్యం కల్పించారు. పెద్దలకు ఇంతకుముందు టిక్కెట్ ధర రూ. 150 కాగా, ఆఫర్ కింద రూ. 130కి తగ్గించారు. మహిళలు, సీనియర్ సిటిజన్స్‌కు ఇంతకు ముందు రూ. 120గా ఉన్న టిక్కెట్ ధరను రూ. 110కి తగ్గించారు. పిల్లలకు రూ. 100 ఉండగా, దీనిని రూ. 90కి సవరించారు.




# సాగునీరు సముద్రం పాలు చేస్తున్నారు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కూడా సాగునీటి విలువ తెలియదని బీఆర్ఎస్ నేత హరీష్ రావు మండిపడ్డారు. ఆదివారం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు.. సాగునీరు సముద్రం పాలు చేస్తున్నారని చెప్పినా.. ప్రభుత్వ వైఖరిలో మార్పు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బురద రాజకీయం చేస్తుందని విమర్శించారు. బీఆర్ఎస్ మీదున్న కోపంతో కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయడం లేదని సీరియస్ అయ్యారు. వర్షాల వల్ల నదులకు భారీగా వరదలు వచ్చాయి. ఒక్కరోజులో ఎస్సారెస్పీ నిండుతుంది. అయినా మిడ్ మానేరుకు ఇంకా నీరు ఎందుకు వదలడం లేదు అని హరీష్ రావు ప్రశ్నించారు. రైతులను ఆగం చేయొద్దు.. తక్షణమే ప్రాజెక్టుల నుంచి నీరు వదలాలని విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం పంపులు ఆన్ చేసి రిజర్వాయర్లు నింపాలని కోరారు. రిజర్వాయర్ల విషయంలో ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి లెటర్ రాశానని అన్నారు.

# కృష్ణాష్టమి వేడుకల్లో విషాదం

**రథానికి కరెంటు తీగలు తగిలి ఐదుగురు మృతి**



హైదరాబాద్ : కృష్ణాష్టమి సందర్భంగా రామంతాపూర్‌లోని గోకులేనగర్‌లో ఆదివారం రాత్రి ఊరేగింపు నిర్వహించారు. ఈ క్రమంలో రథాన్ని లాగుతున్న వాహనం బ్రేక్ డౌన్ అయింది. దానిని పక్కన నిలిపివేసిన యువకులు.. రథాన్ని చేతులతో లాగుతూ ముందుకు తీసుకెళ్లారు. దానికి కరెంటు తీగలు తగలడంతో రథాన్ని లాగుతున్న తొమ్మిది మందికి షాక్ కొట్టింది. దీంతో వారంతా ఒక్కసారిగా విసిరేసినట్లుగా దూరంగా పడిపోయారు. వారిలో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. సీపీఆర్ చేసేందుకు ప్రయత్నించినా లాభం లేకుండా పోయింది.మరో నలుగురిని స్థానికంగా ఉన్న ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతిచెందిన వారిని కృష్ణయాదవ్ (21), సురేశ్ యాదవ్(34), శ్రీకాంత్‌రెడ్డి (35), రుద్రవికాస్ (39), రాజేంద్రరెడ్డి (45)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. గాయపడిన వారిలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గన్‌మెన్ శ్రీనివాస్ కూడా ఉన్నట్లు తెలుస్తున్నది.

# 11 లక్షల మందికి చోటెక్కడ?



ఆకాశమెత్తు ఆశయాలు ఉన్నా ఆచరణలో అట్టడుగున ఉన్నట్లుగా సిటీ మెట్రో పరిస్థితి మారింది. అందుబాటులోకి వచ్చిన పదేళ్లలో మెట్రో ప్రయాణికుల సంఖ్య 11లక్షలకు చేరుతుందనే అంచనాల నడుమ అరకొర మౌలిక వసతులు ప్రయాణికులకు శాపంగా మారుతున్నాయి. మెట్రో నిర్మాణ సమయంలో 2027 నాటికి 11 లక్షల మంది నగర మెట్రోను వినియోగిస్తారనే అంచనాలు ఉన్నాయి. అందుకు తగినట్లుగానే నగర మెట్రోలో ప్రయాణికుల రద్దీ పెరుగుతుంది కానీ, నిలబడే చోటు లేకుండా పోతున్నది.కిక్కిరిపోయిన ప్రయాణమే దక్కుతోంది. అరకొర బోగీలతో నలిగిపోవుడే తప్పా సౌకర్యవంతమైన ప్రయాణం కరువైపోతున్నది. దీంతో పీక్ అవర్‌లో మెట్రోలో నిలబడే చోటు దొరికితే చాలనే స్థాయికి ప్రయాణికులు వచ్చేంత రద్దీ పెరిగింది.హైదరాబాద్ కేంద్రంగా 2018 నాటికి తొలి దశ మెట్రో రైలు అందుబాటులోకి వచ్చింది. మూడేళ్లలోనే ఊహించని స్థాయిలో జనాలకు చేరువైంది. అయితే కరోనా సమయంలో వచ్చిన విపత్కర పరిస్థితులతో మెట్రోకు నగరవాసులు తగ్గిపోయారు. కానీ అనూహ్యంగా ప్రయాణికుల సంఖ్య వృద్ధి చెందడం మెట్రో సంస్థనే భయపెట్టేలా మారుతోంది. 2027 నాటికి మెట్రోలో ప్రయాణించే వారి సంఖ్య ఏకంగా 11 లక్షలకు చేరుతుందనే అంచనాలను నిజం చేసేలా రద్దీ పెరుగుతూనే ఉంది. కానీ అందుకు సరిపడా సదుపాయాలు లేకపోవడమే ప్రయాణికులను కలవరపెడుతోంది.

**ఏటా 25 శాతం వృద్ధి**

ప్రస్తుతం మెట్రో ప్రయాణికుల సంఖ్య 5.6 లక్షలకు చేరింది. ఏటా 25 శాతం వృద్ధితో ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం ఎల్బీనగర్ టూ మియాపూర్, నాగోల్ టూ రాయదుర్గం, ఎంజీబీఎస్ నుంచి జేబీఎస్ మార్గాలలో 57 మెట్రో రైళ్ల ద్వారా రవాణా సేవలను మెట్రో సంస్థ అందిస్తోంది. ఈ లెక్కన ఏటా పెరిగే ప్రయాణికుల రద్దీతో రానున్న రోజుల్లో విదేశీ తరహాలో రైల్ పుషర్లను నియమించుకోవాల్సి వస్తుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక కొత్త రైళ్లను తీసుకువచ్చిన పెరుగుతున్న ప్రయాణికులకు సరిపడా సౌకర్యవంతమైన రవాణా సేవలు అందేలా కనిపించడం లేదు. ఇప్పటికే పీక్ అవర్స్‌లో రైళ్లతో పాటు, స్టేషన్లు అన్నీ కూడా కిక్కిరిపోతుండగా రాయదుర్గం, హైటెక్ సిటీ, అమీర్‌పేట, సికింద్రాబాద్ వంటి ప్రధాన ప్రాంతాలలో ఎక్కే ప్రయాణికులకు నిలబడే చోటు కూడా లేకుండా పోతున్నది.

# మరికొన్ని గంటల్లో భారీ వర్షం.. తస్మాత్ జాగ్రత్త



హైదరాబాద్: భాగ్యనగరంలో మరోసారి భారీ వర్షం కురవనుంది. వరుణుడు మరోసారి నగర వాసులపై తన ప్రతాపం చూపాడానికి సిద్ధమైనట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. రానున్న మరికొన్నిగంటల్లో నగరంలో భారీ వర్షాలు కురవనున్నట్లు తెలిపింది. మరో రెండు రోజులపాటు ఈ భారీ వర్షాలు కొనసాగుతాయని సూచించింది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.అయితే.. నిన్న కురిసిన కుండపోత వర్షానికి హైదరాబాద్ నగరంలోని లోతట్టు ప్రాంతాలు అన్ని చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లన్ని జలమయం అయ్యాయి. వాటర్ లాగిన్ పాయింట్స్‌లో వర్షపు నీరునిలిచిపోయింది. రోడ్లపై నిలిచిపోయిన వర్షపు నీరును జీహెచ్‌ఎంసీ సిబ్బంది క్లియర్ చేస్తున్నారు. కుత్బుల్లాపూర్, మియాపూర్, శేరిలింగంపల్లిలో అత్యధిక వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు. వర్షాల దృష్ట్యా ప్రజలు అందరూ అప్రమత్తండా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రభుత్వం పలు జిల్లాలకు అలర్టులు జారీ చేసిన విషయం తెలిసిందే.

# యమహా నయా స్కూటర్.. గరిష్ఠ ధర రూ.1.02 లక్షలు



యమహా దేశీయ మార్కెట్లోకి హైబ్రిడ్ స్కూటర్‌ను పరిచయం చేసింది. 125 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ స్కూటర్ ఐదు రకాల్లో లభించనున్నది.చెన్నై, ఆగస్టు 16: యమహా దేశీయ మార్కెట్లోకి హైబ్రిడ్ స్కూటర్‌ను పరిచయం చేసింది. 125 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ స్కూటర్ ఐదు రకాల్లో లభించనున్నది. ఫాస్కినో 125 ఎఫ్ఐ హైబ్రిడ్, రేజెడ్ఆర్ 125 ఎఫ్ఐ హైబ్రిడ్‌లు అడ్వాన్స్ స్మార్ట్ ఫీచర్స్, ట్రెస్టైలిష్ లుక్‌తో తయారు చేసింది.ఈ స్కూటర్ ప్రారంభ ధర రూ.79,340 నుంచి రూ.1,02,790 ధరల్లో లభించనున్నాయి. స్మార్ట్ మోటర్ జనరేటర్ టెక్నాలజీ, సైలెంట్ స్టార్ట్ అండ్ స్టాప్ సిస్టమ్, నావిగేషన్ సిస్టమ్ వంటి ఫీచర్స్‌తో తయారు చేసింది

# తగ్గనున్న బీమా ప్రీమియం!..




జీఎస్టీని తగ్గించేయోచనలో కేంద్రం జీఎస్టీ రేట్లను తగ్గిస్తూ కేంద్ర సర్కార్ తీసుకున్న కీలక నిర్ణయం సామాన్యులకు సైతం భారీ ఊరట లభించబోతున్నది. ఈ నిర్ణయంతో పలు రకాల ఉత్పత్తుల ధరలు తగ్గనుండటంతోపాటు బీమా పాలసీల ధరలు కూడా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. జీఎస్టీ రేట్లను తగ్గిస్తూ కేంద్ర సర్కార్ తీసుకున్న కీలక నిర్ణయం సామాన్యులకు సైతం భారీ ఊరట లభించబోతున్నది. ఈ నిర్ణయంతో పలు రకాల ఉత్పత్తుల ధరలు తగ్గనుండటంతోపాటు బీమా పాలసీల ధరలు కూడా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్న నరేంద్ర మోదీ సర్కార్..దీనిని 5 శాతానికి కుదించేయోచనలో ఉన్నది. దీంతో ఈ రెండు రకాల పాలసీలు తీసుకున్నవారికి ఆర్థిక ప్రయోజనాలు కలుగడంతోపాటు బీమా ప్రీమియం చెల్లింపులు తగ్గనున్నాయి.బీమా ప్రీమియంలపై విధిస్తున్న జీఎస్టీని తగ్గించాలని బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ ఇప్పటికే పలుమార్లు కేంద్రానికి సూచించిన విషయం తెలిసిందే. 2047 నాటికి భారతీయులందరికి బీమా ఉండాలనే నినాదంతో ముందుకుసాగుతున్న ఐఆర్‌డీఏఐ..ఈ జీఎస్టీ తగ్గింపు కొంతలో కొంత మేలు చేయనున్నది. బీమా ప్రీమియంపై జీఎస్టీని 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గించాలని సూచించింది.తగ్గిన బీమా వినిమయంబీమా పరిధిని మరింత విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు చేస్తున్న ప్రయోజనాలు బెడిసికొడుతున్నాయి. గతంలో నాలుగు శాతంగా ఉన్న బీమా వినిమయం 2023-24 ఆర్థిక సంవత్సరంలో 3.7 శాతానికి పరిమితమైంది. దీంట్లో నాన్-లైఫ్ వినిమయం ఒక్క శాతంగా ఉండగా, లైఫ్ ఇన్సూరెన్స్‌లు 3 శాతంగా నమోదయ్యాయి. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.2, 101 కోట్ల జీఎస్టీని వసూలు చేసిన బీమా సంస్థలు..2023-24 నాటికి రూ.16,398 కోట్ల ఆదాయాన్ని వసూలు చేశాయి

# కరిగిపోయిన విదేశీ నిల్వలు విదేశీ




నిల్వలు క్రమంగా కరిగిపోతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో మన కరెన్సీ బలహీనపడటంతో గతవారాంతం నాటికి విదేశీ మారకం నిల్వలు 9.3 బిలియన్ డాలర్లు తరిగిపోయాయని రిజర్వు బ్యాంక్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. న్యూఢిల్లీ, ఆగస్టు 16: విదేశీ నిల్వలు క్రమంగా కరిగిపోతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో మన కరెన్సీ బలహీనపడటంతో గతవారాంతం నాటికి విదేశీ మారకం నిల్వలు 9.3 బిలియన్ డాలర్లు తరిగిపోయాయని రిజర్వు బ్యాంక్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. దీంతో విదేశీ నిల్వలు 689 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.అయినప్పటికీ దేశీయ 11 నెలల దిగుమతులకు సరిపడా విదేశీ నిల్వలు ఉన్నాయి. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ తరిగిపోవడం ఇందుకు కారణమని తన వారాంతపు సమీక్షలో వెల్లడించింది. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న విలువ 581.607 బిలియన్ డాలర్లకు తగ్గాయి. అలాగే గోల్డ్ రిజర్వులు 1.706 బిలియన్ డాలర్లు కరిగిపోయి 83.998 బిలియన్ డాలర్లకు పరిమితమం అయ్యాయి

# 2025: ఆదాయం పన్ను పరిమితికి లోబడి ఉన్నా




ఆదాయ పన్ను (ఐటీ) రిటర్నుల ఫైలింగ్ గడువు దగ్గర పడుతోంది. ఏటా జూలై ఆఖరు వరకు ఉండే గడువును ఈ సంవత్సరం ప్రభుత్వం సెప్టెంబరు 15 వరకు పొడిగించింది. చాలా మంది మన... ఆదాయం పన్నురిమితికి లోబడి ఉన్నారిటర్నులు దాఖలు చేయాల్సిందే...ఆదాయ పన్ను (ఐటీ) రిటర్నుల ఫైలింగ్ గడువు దగ్గర పడుతోంది. ఏటా జూలై ఆఖరు వరకు ఉండే గడువును ఈ సంవత్సరం ప్రభుత్వం సెప్టెంబరు 15 వరకు పొడిగించింది. చాలా మంది మన ఆదాయం పన్ను పరిమితికి లోబడే ఉంది కదా.. రిటర్న్ ఫైల్ చేయాల్సిన అవసరం ఏముందని అనుకుంటారు. అయితే ఆదాయం, పన్ను మినహాయింపు పరిధికి లోబడి ఉన్నా.. ఈ కింది సందర్భాల్లో రిటర్న్ ఫైల్ చేయక తప్పదు. అవేమిటంటే..విదేశీ ప్రయాణ ఖర్చులు: ఆదాయం తక్కువగా ఉన్నా చాలా మంది విదేశీ పర్యటనల్లో జోరుగా ఖర్చు చేస్తుంటారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఈ ఖర్చులు రూ.2 లక్షలు లేదా అంతకు మించి ఉంటే వారి ఆదాయం పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా వారు తప్పనిసరిగా ఐటీ రిటర్న్ దాఖలు చేయాలి.విదేశీ ఆస్తులు: ప్రపంచీకరణ పుణ్యమానీ భారతీయులూ పెద్దఎత్తున విదేశాల్లో ఆస్తులు కూడబెడుతున్నారు లేదా విదేశీ కంపెనీల షేర్లు, రుణ పత్రాల్లో మదుపు చేసి వాటిపై వచ్చే డివిడెండ్, వడ్డీ ఆదాయం పొందుతున్నారు. ఇలాంటి వ్యక్తుల ఆదాయం మన దేశంలో పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా.. తప్పనిసరిగా తమ విదేశీ ఆస్తులు, పెట్టుబడులు, ఆదాయ వివరాలతో ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలీ.టీడీఎస్, టీసీఎస్: గత ఆర్థిక సంవత్సరం (2024-25) లో మీ ఆదాయం నుంచి టీడీఎస్ లేదా టీసీఎస్ రూ.25,000 లేదా అంతకు మించి ఉన్నా ఐటీ రిటర్న్ చేయడం తప్పనిసర్యాపార టర్నోవర్, రాబడి: ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక వ్యక్తి వ్యాపార అమ్మకాలు, టర్నోవర్, ఆదాయం రూ.60 లక్షలు మించితే..ఆ వ్యక్తి తప్పనిసరిగా రిటర్న్ ఫైల్ చేయాలి. అదే వృత్తి నిపుణులైతే వార్షిక ఆదాయం రూ.10 లక్షలు మించితే తప్పనిసరిగా రిటర్న్ దాఖలు చేయాలి

# రుణగ్రహీతలకు ఎస్బీఐ షాక్ దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం




స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) రుణ గ్రహీతలకు షాకిచ్చింది. నూతనంగా గృహ రుణాలను తీసుకునేవారికి అధికం భారం మోపుతున్నది. గృహ రుణాలపై వడ్డీరేటును పావు శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నది దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) రుణ గ్రహీతలకు షాకిచ్చింది. నూతనంగా గృహ రుణాలను తీసుకునేవారికి అధికం భారం మోపుతున్నది. గృహ రుణాలపై వడ్డీరేటును పావు శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. ఈ నిర్ణయం ఈ నెల 1 నుంచి అమలులోకి వచ్చినట్టు పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో రుణ గ్రహీతల జేబులకు మరిన్ని చిల్లులు పడబోతున్నాయి. ప్రస్తుతం బ్యాంక్ గృహ రుణాలపై %×త్వతీవర్ తీఫ్వ%7.50 శాతం నుంచి 8.70 శాతంగా ఆఫర్ చేస్తున్నది. గతంలో 7.50 శాతం నుంచి 8.45 శాతంగా ఉన్నది. తక్కువ సిబిల్ స్కోర్ ఉండేవారికి అధిక వడ్డీరేటుకు గృహ రుణాన్ని అందించనున్నది. ఈ వడ్డీరేట్ల పెంపు కొత్తగా తీసుకునే రుణాలకు మాత్రమే వర్తించనున్నదని, పాత వాటికి వర్తించదనిబ్యాంక్‌స్పష్టంచేసింది.ఆర్బీఐవడ్డీంచకపోయి ప్పటికీ రిజర్వుబ్యాంక్ తన పరపతి సమీక్షలో కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ ఎస్బీఐ మాత్రం వడ్డీరేట్లను పెంచడం విశేషం. రెపోరేటును 5.55 శాతంగా ఉంచిన విషయం తెలిసిందే. ఎస్బీఐ తీసుకున్న నిర్ణయంతో ఇతర బ్యాంకులు కూడా గృహ రుణాలపై వడ్డీరేట్లను పెంచే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఓవర్‌డ్రాఫ్ట్ ఫెసిలిటీ కలిగిన గృహ రుణంపై వడ్డీరేటు 7.75 శాతం నుంచి 8.95 శాతంగా వసూలు చేస్తున్నది. అలాగే టాప్-అప్ రుణాలపై బ్యాంక్ 8 శాతం నుంచి 10.75 శాతం చొప్పున వడ్డీని వసూలు చేస్తున్నది.ఉదాహరణకు 20 ఏండ్ల కాలపరిమితితో రూ.30 లక్షల గృహ రుణం తీసుకునేవారు 8.45 శాతం వార్షిక వడ్డీతో రూ.25,830 ఈఎంఐలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ వడ్డీరేటు 8.70 శాతానికి పెంచడంతో ఈఎంఐ రూ.26,278కి చెల్లించాల్సివుంటుంది. అంటే నెలకు రూ.450 అదనంగా చెల్లించాల్సివుంటుంది. అంటే మొత్తం గృహ రుణంపై లక్ష రూపాయలు చెల్లించాలి. తక్కువ స్థాయి రుణాలతోపాటు రూ.50 లక్షలకు పైగా రుణాలు తీసుకున్నవారికి కూడా భారం పడనున్నది.

**యూనియన్ బ్యాంక్ కూడా..**

మరో ప్రభుత్వరంగ సంస్థ యూనియన్ బ్యాంక్ కూడా గృహ రుణాలపై వడ్డీరేటును పది బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో గతంలో 7.35 శాతంగా ఉన్న గృహ రుణాలపై వడ్డీరేటు 7.45 శాతానికి ఎగబాకింది.ఎంసీఎల్ఆర్‌ని తగ్గించిన పలు బ్యాంకులు

ఎస్బీఐ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. ఒకవైపు గృహ రుణాలపై వడ్డీరేట్లను పెంచిన బ్యాంక్..మరోవైపు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండింగ్ బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేట్లను 5 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఈ నూతన రేట్లు శుక్రవారం నుంచి అమలులోకి వచ్చాయని పేర్కొంది. దీంతో ఒక్కరోజు, నెల కాలపరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేటు 7.95 శాతం నుంచి 7.90 శాతానికి దించింది. అలాగే నెల రోజుల రుణాలపై వడ్డీరేటు 8.8 శాతం నుంచి 8.75 శాతానికి దించిన బ్యాంక్..రెండేండ్లు, మూడేండ్ల రుణాలపై రేటును 8.85 శాతం నుంచి 8.80 శాతానికి తగ్గించింది.

# కొత్తగా కారు కొనాలనుకుంటున్నారా..? దీపావళి ఆగండి..!

ఈ ఏడాది అక్టోబర్ నాటికి వస్తు సేవల పన్నుని సరళీకృతం చేసి, పన్ను రేట్లను తగ్గించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రసంగంలో తెలిపారు. ఈ మార్పులు అమలైతే దీపావళి నాటికి ప్యాసింజర్ కార్లు, ద్విచక్ర వాహనాల ధర తగ్గే అవకాశాలున్నాయి. ఎఈ ఏడాది అక్టోబర్ నాటికి వస్తు సేవల పన్ను (%+ూ%)ని సరళీకృతం చేసి, పన్ను రేట్లను తగ్గించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రసంగంలో తెలిపారు. ఈ మార్పులు అమలైతే దీపావళి నాటికి ప్యాసింజర్ కార్లు, ద్విచక్ర వాహనాల ధర తగ్గే అవకాశాలున్నాయి. దేశీయ డిమాండ్‌ను పెంచడమే ప్రభుత్వ లక్ష్యం, ఇది సాధారణ ప్రజలకు కూడా ప్రయోజనం చేకూరుస్తుంది. ప్రస్తుతం, ప్రభుత్వం చాలా వస్తువులపై 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం చొప్పున పన్ను విధిస్తోంది. కొత్త సంస్కరణల ప్రకారం.. సరళీకృతం చేయడానికి, రెండు శ్లాబులుగా విభజించేందుకు సిద్ధమవుతున్నది. 5 శాతం (మెరిట్), 18 శాతం శ్లాబ్‌లను తీసుకురానున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం కార్లు, ద్విచక్ర వాహనాలపై 28 శాతం పన్ను విధిస్తున్నారు. 18 శాతానికి తగ్గించే అవకాశం ఉంది.దాంతో వాహనాలను కొనుగోలు చేసే సమయంలో దాదాపు 5శాతం నుంచి పదిశాతం



వరకు ఆదా చేసే అవకాశం ఉంటుంది. కొత్త జీఎస్టీ రేటు అమలులోకి వస్తే రూ.10లక్షల కంటే తక్కువ ధర ఉన్న ఎంట్రీ లెవల్ ద్విచక్ర వాహనాలు, చిన్న కార్ల వినియోగదారులకు పెద్ద ప్రయోజనం చేకూరుతుంది. వాహనాల ధరలు తగ్గడమే కాకుండా ఆటోమొబైల్ విడిభాగాల ధరలు దిగిరానున్నాయి. తయారీ ఖర్చును ప్రభావితం చేస్తుంది. వాహనాల ఉత్పత్తి సైతం దిగి వస్తుంది. అలాగే, విడిభాగాల ధర తగ్గింపు కారణంగా వాహనాలరుదాపై భారం తగ్గుతుంది. ముఖ్యంగా ద్విచక్ర వాహన కంపెనీలు చాలా కాలంగా ఈ పన్ను తగ్గింపును డిమాండ్ చేస్తున్నాయి. సమాచారం ప్రకారం, ఎలక్ట్రిక్ వాహనాల ై పన్ను స్లాబ్ మునుపటిలాగే 5 శాతంగా ఉంటుంది.అదే సమయంలో లగ్జరీ కార్లపై ఉన్న పన్ను యథావిధిగా కొనసాగించే అవకాశాలున్నాయి. దాంతో పాటు ప్రభుత్వం పరిహార సెస్‌ను ప్రయాణికుల వాహనాలపై సైతం వర్తిస్తుంది. మరోవైపు, పొగాకు వంటి ఉత్పత్తులపై 40 శాతం పన్ను విధించాలని సిఫార్సు చేసినట్లు సమాచారం. పన్ను తగ్గింపు కారణంగా, ఆటోమొబైల్స్ మాత్రమే కాకుండా, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు కూడా తగ్గనున్నాయి. ఇది దేశీయ వినియోగం, వాణిజ్యం రెండింటినీ పెంచుతుంది. తద్వారా మొత్తం ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. మంత్రుల బృందం సిఫార్సులను కౌన్సిల్ త్వరలో చర్చిస్తుందని, త్వరలో అమలు చేయడానికి ప్రయత్నాలు జరుగుతాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ప్రజలు దాని ప్రయోజనాలను పొందడమే లక్ష్యం' అని మంత్రిత్వ శాఖ తెలిపింది. దీపావళి నాటికి అంటే అక్టోబర్-నవంబర్‌లో కొత్త పన్ను రూల్స్ అమలులోకి వస్తాయని భావిస్తున్నారు

# ఎ ఫాస్టాగ్ వార్షిక పాస్.. తొలిరోజు 1.4 లక్షల మంది కొనుగోలు




స్వాతంత్ర్య దినోత్సవం నుంచి దేశంలో ఫాస్టాగ్ టోల్ చెల్లింపు విధానంలో పెనుమార్పులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. స్వాతంత్ర్య దినోత్సవం నుంచి దేశంలో ఫాస్టాగ్ టోల్ చెల్లింపు విధానంలో పెనుమార్పులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. తరచూ ప్రయాణించే వారికి మరింత సులభ, చౌక హైవే ప్రయాణాన్ని కల్పించేందుకు కొత్తగా ఫాస్టాగ్ వార్షిక పాసును నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్ల కోసం ప్రవేశపెట్టిన రూ.3,000 వార్షిక హైవే టోల్ పాసు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది.దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలలోని సుమారు 1,150 టోల్ ప్లాజాల్లో వార్షిక పాస్ సౌకర్యాన్ని ఎన్‌హెచ్ఏఐ విజయవంతంగా అమలు చేసింది. తొలి రోజు సాయంత్రం 7 గంటల వరకు దాదాపు 1.4 లక్షల మంది వినియోగదారులు వార్షిక పాస్‌ను కొనుగోలు చేసి యాక్టివేట్ చేసుకున్నట్లు ఎన్‌హెచ్ఏఐ వెల్లడించింది. అదేవిధంగా టోల్ ప్లాజాల్లో దాదాపు 1.39 లక్షల లావాదేవీలు నమోదైనట్లు తెలిపింది. ఈ వార్షిక పాస్ తీసుకున్న వినియోగదారులు ఎస్ఎమ్ఎస్ ద్వారా జీరో టోల్ మెసేజ్ అందుకుంటున్నట్లు ఎన్‌హెచ్ఏఐ వివరించింది.

**ఎవరికి వర్తిస్తుంది?**

ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్లకు మాత్రమే ఈ వార్షిక ఫాస్టాగ్ పాస్ వర్తిస్తుంది. ఎన్‌హెచ్ఏఐ నిర్వహించే జాతీయ హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలపైన టోల్ చార్జీలు చెల్లించేందుకు ఒకేసారి డబ్బు చెల్లించి ఫాస్టాగ్ వార్షిక పాసును తీసుకోవచ్చు. ఈ పథకం కింద వాహన యజమానులు ఒకేసారి రూ. 3,000 చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదిపాటు ఎన్‌హెచ్ఏఐ నిర్దేశించిన జాతీయ రహదారుల్లో 200 వరకు టోల్ ప్లాజాలను దాటవచ్చు. ఒకవేళ గరిష్ఠ పరిమితి (200 టోల్ క్రాసింగ్‌లు) ఏడాదిలోపలే ముగిసిపోతే ఆటోమేటిక్‌గా సాధారణ విధానంలోకి ఫాస్టాగ్ మారిపోయి డబ్బు చెల్లించి టోల్ దాటవలసి ఉంటుంది.

**పాసు ఎలా కొనాలి?**

వార్షిక ఫాస్టాగ్ పాసు కొనేందుకు వాహనదారులు తమ వాహన నంబరు, ఫాస్టాగ్ ఐడీ ఉపయోగించి రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్ఏఐ/ఎంఓఆర్‌టీహెచ్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వాలి. తమ ఫాస్టాగ్ యాక్టివ్‌గా, సక్రమంగా ఇన్‌స్టాల్ అయి ఉందో లేదో ధ్రువీకరించుకోవాలి. యూపీఐ, డెబిట్ లేదా క్రెడిట్ కార్డు లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో రూ. 3,000 చెల్లించాలి. ఆగస్టు 15న పాసు యాక్టివేట్ అవుతుంది. యూజర్లకు ఎస్ఎంఎస్ ద్వారా కన్ఫర్మేషన్ మెసేజ్ అందుతుంది. ఫాస్టాగ్ వార్షిక పాసు ఇతరులకు బదిలీ కాదు. రిజిస్టర్డ్ వాహనానికి మాత్రమే పనిచేస్తుంది. అంతేగాక ఈ పాస్‌ను ఒకసారి కొనుగోలు చేస్తే మళ్లీ డబ్బు వాపసు వచ్చే అవకాశం ఉండదు. పాసు ఆటోమేటిక్‌గా రెన్యూ కాదు. దాని గడువు తీరిన తర్వాత మళ్లీ కొనుగోలు చేయాల్సి ఉంటుంది

# ఆకాశమే హద్దుగా బంగారం.. చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్న ధర

## ఖీరూ.3,600 పెరిగిన తులం విలువ

## రూ.1,02,620కి చేరుకున్న ధర

బంగారం భగ..భగమండుతున్నది. దేశీయ ఎగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రప్ మరో 25 శాతం సుంకాన్ని విధించనున్నట్టు ప్రకటించడంతో పెట్టుబడిదారుల్లో ఆందోళన తీవ్రస్థాయికి చేరుకున్నది. దీంతో తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు చుక్కలను అంటుకున్నాయి. ంగారం భగ..భగమండుతున్నది. దేశీయ ఎగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రప్ మరో 25 శాతం సుంకాన్ని విధించనున్నట్టు ప్రకటించడంతో పెట్టుబడిదారుల్లో ఆందోళన తీవ్రస్థాయికి చేరుకున్నది. దీంతో తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు చుక్కలను అంటుకున్నాయి. దేశ రాజధాని నూఢిల్లీ బులియన్ మార్కెట్లో గురువారం ఒకేరోజు బంగారం ధర రూ.3,600 ఎగబాకింది. ఒకేరోజు ఇంతటి స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి పదిగ్రాముల పుత్తడి ధర చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.1,02,620కి చేరుకున్నది. ఈ విషయాన్ని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ తాజాగా వెల్లడించింది. అంతకుముందు ఈ ధర రూ.99,020గా ఉన్నది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర అన్ని పన్నులు కలుపుకొని రూ.3,600 ఎగబాకి రూ.1,02,200గా



నమోదైంది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.220 అందుకొని రూ.1,02,550 పలికింది.

**వెండి కూడా..**

బంగారంతోపాటు వెండి పరుగులు పెట్టింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ ఊపందుకోవడంతో కిలో వెండి రూ.1,500 ఎగబాకి రూ.1,14,000కి చేరుకున్నది. పుత్తడితోపాటు వెండి కూడా రికార్డు స్థాయికి ఎగబాకింది. ఆటు ఎంసీఎక్స్ మార్కెట్లో అక్టోబర్ నెలకుగాను రూ.893 ఎగబాకి రూ.1,02,155 పలుకగా, డిసెంబర్ నెలకుగాను రూ.880 అధికై రూ.1,03,047గా నమోదైంది. అలాగే సెప్టెంబర్ నెల డెలివరీకిగాను వెండి కాంట్రాక్ట్ ధర రూ.1,503 లేదా 1.32 శాతం ఎగబాకి రూ.1,51,158 పలికింది.

**గ్లోబల్ మార్కెట్లోనూ అదే జోరు**

అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర బుసలుకొడుతున్నది. ఇప్పటికే రికార్డుల మీద రికార్డులు కొడుతున్న పుత్తడి న్యూయార్క్ బులియన్ మార్కెట్లో ఔన్స్ ధర తొలిసారిగా 3,400 డాలర్లు దాటింది. బుధవారం పెరిగిన ధరలు..గురువారం అదే ట్రెండ్‌ను కనిపించాయి. ఔన్స్ గోల్డ్ ధర 17 డాలర్లు ఎగబాకి 3,450.30 డాలర్ల స్థాయిలో కదలాడుతున్నది. అలాగే వెండి ఔన్స్ ధర 38.34 డాలర్ల వద్ద కొనసాగుతున్నది. మరోసారి ట్రంప్ ప్రతీకార సుంకాల విధింపునకు మొగ్గుచూపనుండే అవకాశాలు ఉండటం కూడా పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొనడంతోపాటు అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు ఉండటం కూడా ధరలు పుంజుకోవడానికి ప్రధాన కారణాలని బులియన్ వర్తకులు చెబుతున్నారు



## రెండేళ్లలో మెగా హీరోలు 8 ఫ్లాపులు ఇచ్చారా.. బన్నీ ఒక్కడే నిలబడ్డాడు..!

టాలీవుడ్‌లో మెగా ఫ్యామిలీకి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మెగా ఫ్యామిలీ నుంచి చిరంజీవి, పవన్ కళ్యాణ్, అల్లు అర్జున్, రామ్ చరణ్, వరుణ్ తేజ్, సాయి ధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్, అల్లు శిరీష్ లాంటి ఎనిమిది మంది హీరోలు ఉన్నారు. వీరి సినిమాలు ప్రతీ ఏడాది ప్రేక్షకుల ముందు వస్తుంటాయి. టాలీవుడ్‌లో మెగా ఫ్యామిలీకి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మెగా ఫ్యామిలీ నుంచి చిరంజీవి, పవన్ కళ్యాణ్, అల్లు అర్జున్, రామ్ చరణ్, వరుణ్ తేజ్, సాయి ధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్, అల్లు శిరీష్ లాంటి ఎనిమిది మంది హీరోలు ఉన్నారు. వీరి సినిమాలు ప్రతీ ఏడాది ప్రేక్షకుల ముందు వస్తుంటాయి. కానీ, ఇటీవల కాలంలో వీరి సినిమాలు బాక్సాఫీస్ దగ్గర సత్తా చూపలేకపోతున్నాయి. గత రెండు సంవత్సరాల్లో ఈ కుటుంబానికి చెందిన ఎనిమిది సినిమాలు డిజాస్టర్లుగా నిలిచి, దాదాపు రూ.400 కోట్లకు పైగా నష్టాలను తీసుకొచ్చినట్టు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.అల్లు అర్జున్ మాత్రం పుష్ప 2తో ఇండస్ట్రీ రేంజ్ హిట్‌ను అందుకున్నారు. మిగిలిన మెగా హీరోలతో పోలిస్తే ఆయన సినిమా కమర్షియల్‌గా కూడా భారీ విజయాన్ని సాధించింది. 2023లో చిరంజీవి హీరోగా వచ్చిన భోళా శంకర్ సినిమా ఘోర పరాజయాన్ని చవిచూసింది. మెహర్ రమేష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం తక్కువ బజ్‌తో వచ్చినా, ఆఖరికి రూ.55 కోట్ల వరకు నష్టం మిగిల్చినట్టు సమాచారం.ఇక పవన్ కళ్యాణ్ నటించిన హరి హర వీరమల్లు చిత్రం బాక్సాఫీస్ వద్ద అతిపెద్ద డిజాస్టర్‌గా నిలిచి రూ.85 కోట్ల నష్టం మిగిల్చింది. అలాగే, సాయి ధరమ్ తేజ్‌తో కలిసి నటించిన బ్రో చిత్రం కూడా డిజప్పాయింట్ చేసి రూ.40 కోట్ల నష్టాన్ని తీసుకొచ్చింది. పవన్ నుండి రాబోయే ఓజీపై మెగా అభిమానుల ఆశలు పెట్టున్నారు.ఇక శంకర్ దర్శకత్వంలో తెరకెక్కి భారీ అంచనాల నడుమ ప్రేక్షకుల ముందుకు వచ్చిన గేమ్ ఛేంజర్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఈ చిత్రం సంక్రాంతికి విడుదలై భారీ హైప్ మధ్య రిలీజ్ అయినా, చివరకు దాదాపు రూ.100 కోట్ల నష్టాన్ని మిగిల్చింది. వరుణ్ తేజ్ నటించిన గాండీవధారి అర్జున, ఆపరేషన్ వాలెంటైన్, మట్కా..ఈ మూడు సినిమాలూ వరుసగా ఫెయిలయ్యాయి. ఈ మూడు చిత్రాలు కలిపి దాదాపు రూ.80 కోట్ల నష్టాన్ని తెచ్చినట్టు ట్రేడ్ వర్గాల అంచనా. ఉప్పెనతో మంచి హిట్ అందుకున్న వైష్ణవ్ తేజ్, ఆ తర్వాత వచ్చిన సినిమాలతో అదెంతా నిలబెట్టుకోలేకపోయాడు. ఆదికేశవ చిత్రం పెద్దగా ఆడకపోవడంతో దాదాపు రూ.27 కోట్ల నష్టం మిగిలిందని సమాచారం. ఇలా గత రెండు సంవత్సరాల్లో మెగా ఫ్యామిలీ నుండి వచ్చిన ఎనిమిది సినిమాలు డిజాస్టర్‌గా నిలిచి, కలిపి రూ.400 కోట్ల వరకు నష్టాలు తీసుకొచ్చాయని అంటున్నారు. ప్రస్తుతం మెగా అభిమానులంతా


## పరేడ్‌లో జంటగా కనిపించిన విజయ్ దేవరకొండ- రష్మిక





మరికొద్ది రోజులలో విడుదల కానున్న ఓజీ, విశ్వంభర, లాంటి సినిమాలపై చాలా హోప్స్ పెట్టుకున్నారుఅమెదరికాలోనిన్యూయార్క్‌లోనిర్వ హిం చిన 43వ వార్షిక ఇండియా డే పరేడ్ గ్రాండ్‌గా జరిగింది. భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జాతీయ ఉత్సవాలుగా జరుపుకునే క్రమంలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ ప్రతి సంవత్సరం ఈ పరేడ్‌ను నిర్వహిస్తూవస్తుంది.భారత79వస్వాతం త్ర్యది నోత్సవాన్నిపురస్కరి ంచుకుని భారత కాన్సులేట్ ఆధ్వర్యంలో అమెరికాలో అతిపెద్ద భారతీయ పరేడ్ అయిన “ఇండియా డే పరేడ్” అత్యంత ఘనంగానిర్వహించారు.అమెరికాలోని న్యూయా ర్క్‌లో నిర్వహించిన 43వ వార్షిక ఇండియా డే పరేడ్ గ్రాండ్‌గా జరిగింది. భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జాతీయ ఉత్సవాలుగా జరుపుకునే క్రమంలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ ప్రతి సంవత్సరం ఈ పరేడ్‌ను నిర్వహిస్తూ వస్తుంది. భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత కాన్సులేట్ ఆధ్వర్యంలో అమెరికాలో అతిపెద్ద భారతీయ పరేడ్ అయిన “ఇండియా డే పరేడ్” అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు వేలాదిమంది భారతీయ అమెరికన్లు, విదేశీ స్నేహితులు హాజరయ్యారు. ప్రముఖ సినీతారలు రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ ఈ కార్యక్రమానికి 2025 సంవత్సరానికి గాను “గ్రాండ్ మార్షల్స్”గా హాజరై పరేడ్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వీరిద్దరూ భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని ప్రతినిధిగా చాటి చెప్పారు.వేదికపై కాంగ్రెస్ సభ్యుడు శ్రీ థానేదార్, న్యూయార్క్ మేయర్ ఎరిక్ ఆడమ్స్, పార్లమెంటు సభ్యుడు సత్నామ్ సింగ్ సంధు తదితర ప్రముఖులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయుల ఐక్యత, శ్రమ, సంస్కృతి విశిష్టతను వారు కొనియాడారు. “భారత్ వెలుపల అతిపెద్ద పరేడ్ వేడుకను న్యూయార్క్‌లో 79వ స్వాతంత్ర్య దినోత్సవం రూపంలో జరుపుకున్నాం. వేడుకల్లో పాల్గొన్న అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ పరేడ్‌ను ఇంత గొప్పగా నిర్వహించినందుకు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ %చీ-చీజీ-చీజు%కి ప్రత్యేక ధన్యవాదాలు అని కాన్సులేట్ పేర్కొంది.దేశం దాటి ప్రపంచానికి భారత్ గొప్పతనాన్ని చాటి చెప్పే ఈ వేడుక, భారతీయులు గర్వపడేలా చేసింది. ఇక ఈసారి న్యూయార్క్ లో జరిగిన ఇండియన్ పరేడ్ లో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న గెస్టులుగా హాజరు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఇద్దరూ కలిసి పరేడ్ లో పాల్గొనడంతో వారి ఇద్దరి ఫోటోలు, వీడియోలు వైరల్ గా మారాయి. ఇక ఇప్పుడు సమ్మె కారణంగా షూటింగ్స్ ఆగడంతో పరేడ్ తర్వాత రష్మిక- విజయ్ వెకేషన్

## శ్రీదేవి, రాఘవేంద్రరావు వల్లే ఆ సినిమా హిట్టయింది





తన సినీ ప్రస్థానంలో మైలురాయిగా నిలిచిన ‘ఆఖరి పోరాటం’ సినిమాపై అగ్ర నటుడు అక్కినేని నాగార్జున ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఆ భారీ విజయం సాధించిన చిత్రంలో తానొక బొమ్మలా మాత్రమే ఉన్నానని, అసలు విజయం దర్శకుడు రాఘవేంద్రరావు, నటి శ్రీదేవిలకే దక్కుతుందని చెప్పారు. నటుడు జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ‘జయమ్ము నిశ్చయమ్మురా’ టాక్ షోలో పాల్గొన్న నాగార్జున, తన కెరీర్ ఆరంభంలోని అనేక సంగతులను గుర్తుచేసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “కమర్షియల్ చిత్రాల్లో ‘ఆఖరి పోరాటం’ నాకు పెద్ద విజయాన్ని అందించింది. కానీ నిజం చెప్పాలంటే ఆ సినిమాలో నేను చేసింది ఏమీ లేదు. దర్శకుడు రాఘవేంద్రరావు, శ్రీదేవికే క్రెడిట్ దక్కుతుంది” అని నాగార్జున తన అనుభవాన్ని పంచుకున్నారు. కెరీర్ తొలినాళ్లలో తనను ప్రేక్షకులు ‘నాగేశ్వరరావు గారి అబ్బాయి’గానే చూసేవారని, అయితే ‘మజ్ను’ చిత్రం తర్వాతే తనలోని నటుడిని గుర్తించారని ఆయన తెలిపారు.

**నెల రోజులు ఆయన వెంటపడ్డాను!**

ఇదే కార్యక్రమంలో ‘గీతాంజలి’ సినిమా అవకాశం ఎలా వచ్చిందో కూడా నాగార్జున వివరించారు. “మణిరత్నం తీసిన ‘మౌనరాగం’ చూసి ఆయన దర్శకత్వంలో నటించాలని బలంగా అనుకున్నా. ఆయన ఎక్కడ వాకింగ్‌కు వెళతారో తెలుసుకుని, దాదాపు నెల రోజుల పాటు ఆయన వెంటపడ్డాను. మొదట ఆ కథను తమిళంలో తీయాలని ఆయన అనుకున్నారు. కానీ, నేను పట్టుబట్టి తెలుగులో తీయమని ఒప్పించాను. అలా ‘గీతాంజలి’ నాకు మరపురాని హిట్‌గా నిలిచింది” అని వెల్లడించారు.తాను నటుడిగా మారడానికి నాగార్జున ప్రోత్సాహమే కారణమని జగపతి బాబు ఇదే షోలో తెలిపారు. నాగార్జున, జగపతి బాబుల మధ్య జరిగిన ఈ సరదా సంభాషణ ప్రస్తుతం ‘జీ 5’ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ప్రసారం అవుతోంది.

## నాకు మందు తాగే అలవాటు ఉంది

తెలుగులో వరుస విజయాలతో ‘గోల్డెన్ బ్యూటీ’గా పేరు తెచ్చుకున్న నటి సంయుక్త మీనన్, ఇటీవల తాను చేసిన కొన్ని వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. తనకు మద్యం సేవించే అలవాటు ఉందని ఆమె బహిరంగంగా చెప్పడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.అయితే, తాను రోజూ మద్యం తీసుకోనని, కేవలం తీవ్రమైన ఒత్తిడి లేదా ఆందోళనగా అనిపించిన సందర్భాల్లో మాత్రమే కొద్దిగా తీసుకుంటానని ఆమె స్పష్టం చేశారు. మానసిక ప్రశాంతత కోసం అప్పుడప్పుడు ఇలా చేస్తానని సంయుక్త వివరించారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.పవన్ కల్యాణ్ ‘భీమ్లా నాయక్’ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన సంయుక్త, ఆ తర్వాత ‘సార్’, ‘విరూపాక్ష’తో పాటు పలు చిత్రాలతో విజయాలు అందుకున్నారు.బాలకృష్ణతో కలిసి నటించిన ‘అఖండ 2’ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ‘స్వయంభు’, ‘నారి నారి నడుమ మురారి’, పూరి జగన్నాథ్, విజయ్ సేతుపతి చిత్రాల్లో ఆమె నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాలు షూటింగ్ జరుపుకుంటున్నాయి.



## కూలీలో అదరగొట్టిన లేడీ విలన్





లోకేష్ కనగకార్ దర్శకత్వంలో తెరకెక్కిన కూలీ సినిమా ప్రస్తుతం థియేటర్లో దూసుకెల్తుంది. రజనీకాంత్ - లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో వచ్చిన ఈ చిత్రం భారీ విజయాన్ని సాధించగా, ఈ సినిమాలో లేడీ విలన్ గా కనిపించిన కళ్యాణి పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.అయితే, ఈ కళ్యానీ ఎవరో కారు.. కన్నడ నటి రచితా రామ్.. తమిళ చిత్రసీమలో తొలిసారిగా “కూలీ”లోని కళ్యాణి పాత్ర ద్వారా లేడీ విలన్‌గా పరిచయం అయ్యింది.2013లో దర్శన్‌తో కలిసి “బుల్బుల్” సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసిన రచితా రామ్, ఆ చిత్రం విజయంతో వరుస అవకాశాలు అందుకుంది. కన్నడలో ఉపేంద్ర, పునీత్ రాజ్‌కుమార్, దర్శన్ వంటి స్టార్ హీరోలతో పలు చిత్రాలలో నటించింది.రచితా రామ్ తెలుగులోనూ నటించింది. 2022లో కళ్యాణ్ దేవ్ హీరోగా వచ్చిన “సూపర్ మచ్చి” సినిమాతో తెలుగు తెరకు రచితా పరిచయమైంది. అయితే ఆ చిత్రం విఫలమవడంతో, ఆమెకు టాలీవుడ్‌లో మరో అవకాశం రాలేదు. కన్నడలో స్టార్ హీరోలతో పలు చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్న ఈ నటి, ఇప్పుడు కోలీవుడ్‌లో లేడీ విలన్‌గా అడుగుపెట్టడం సినిమా వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.




## పవన్ కల్యాణ్ ‘ఓజీ’ నుంచి ‘కన్మణి’ ప్రియాంక అరుల్ మోహన్ లుక్ విడుదల

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న భారీ యాక్షన్ చిత్రం ‘ఓజీ’ నుంచి ఓ కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న ప్రియాంక అరుల్ మోహన్ ఫస్ట్ లుక్‌ను శనివారం చిత్ర బృందం అధికారికంగా విడుదల చేసింది. ఈ చిత్రంలో ఆమె ‘కన్మణి’ అనే పాత్రలో కనిపించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ పోస్టర్‌కు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది.‘రన్ రాజా రన్’, ‘సాహో’ చిత్రాల ఫేమ్ సుజీత్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ కల్యాణ్‌ను మునుపెన్నడూ చూడని శక్తివంతమైన గ్యాంగ్‌స్టర్ పాత్రలో చూపించబోతున్నారు. ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ ‘ఓజాస్ గంభీర’ అనే పాత్రలో నటిస్తుండగా, ఆయన సరసన ప్రియాంక అరుల్ మోహన్ నటిస్తున్నారు. తాజా పోస్టర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.ప్రముఖ నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. భారీ తారాగణంతో, ఉన్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332